

సోమశిలలో 26.270 టీఎంసీల నీరు



అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటిమట్టం పడిపోతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 26.270 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రేపటి నుంచి నిజం గెలవాలి

- జిల్లాలో మూడు రోజులు నారా భువనేశ్వరి పర్యటన
- మృతుల కుటుంబాలకు పరామర్శ

నెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జిల్లా పర్యటన ఖరారైంది. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో ఆమె పర్యటించనున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో తీవ్ర మనోవేదనకు గురై మృతి చెందిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించనున్నారు. 31వ తేదీన సాయంత్రం 5:35 గంటలకు ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం, సాయంత్రం 6:30 గంటలకు ఉలవపాడు మండలం ఆత్మకూరులో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అదే రోజు రాత్రి కందుకూరులో బస చేస్తారు. మరుసటి రోజు ఫిబ్రవరి 1న ఉదయం 9 గంటలకు గుడ్లూరు, 10:45 గంటలకు గుడ్లూరు మండలం దర్కానిపాడు, 12:20 గంటలకు కొండాపురం మండలం కొమ్మి గ్రామాల్లో పర్యటన అనంతరం సాయంత్రం నెల్లూరుకు చేరుకుంటారు. 3:35 గంటలకు నగరంలోని 29వ డివిజన్, 4:10 గంటలకు 41వ డివిజన్‌లో పర్యటించి అనంతరం జొన్నవాడ కామాక్షమ్మను దర్శించుకుని, నెల్లూరులో బస చేస్తారు. ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 10:20 గంటలకు అల్లీపురం, 11:35 గంటలకు కలువాయి, 2:05 గంటలకు రాపూరు మండలం శానాయపాలెం గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.



లక్ష్యాల సాధనకు చర్యలు

బాధ్యతల స్వీకరించిన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



కలెక్టర్‌ను కలిసిన జేసీ రాజేంద్రన్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న రీసర్వే, స్వామిత్వ, గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకొంటామని నూతన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్‌గా రాజేంద్రన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజేంద్రన్ మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేరళలోని క్యాలికట్‌కు చెందిన రాజేంద్రన్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. అంతకుముందు ఆయన కలెక్టర్ హరినారాయణన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకులు నూతన జేసీ రాజేంద్రన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఆసరా'లో అవస్థలు

అక్కచెల్లెమ్మలకు జగనన్న చిక్కులు



కలిగిరిలో ఎండలోనే నిలబడి ఉన్న మహిళలు

- చెక్కుల పంపిణీ పేరుతో పొదుపు మహిళలకు చుక్కలు
- సభకు రాకుంటే పథకాలు కట్ అంటూ హూకుం
- వచ్చిన వారికి తప్పని పాట్లు
- గంటల తరబడి ఉండలేక మధ్యలోనే జంప్
- స్కూళ్ల గేట్లు మూసి అడ్డుకునే యత్నం
- తిరగబడి ఇళ్లకు..
- మరోవైపు విద్యార్థుల చదువులకూ ఆటంకం

ఆసరా చెక్కుల పంపిణీ పేరుతో పొదుపు మహిళలకు చుక్కలు చూపిస్తున్నారు. సభకు రావాల్సిందేనంటే పట్టుబట్టి పిలిపిస్తున్న సీసీలు, వీవోఏలు వారికి సదుపాయాలు కల్పించడంలో చేతులెత్తేస్తున్నారు. చివరకు షామియానాలు, కుర్చీలు కూడా సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో ఎండలో గంటల తరబడి నిలబడలేక మధ్యలోనే వెళ్లిపోతున్నారు. అలా వెళుతున్నవారినీ గేట్లు మూసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. కలిగిరి, మర్రిపాడు మండలాల్లో సోమవారం ఇదే తరహా ఘటనలు జరిగాయి. 'కుర్చీల్లేవు... కూడు లేదు, కాళ్ళు పీకుతున్నాయి, మేము ఇంటికెళ్లా'లంటూ మహిళలు బలవంతంగా గేటునెట్టుకొని వెళ్లిపోయారు. - కలిగిరి/మర్రిపాడు

కనిగిరి హైస్కూల్లో ఆసరా చెక్కుల పంపిణీ సభ మధ్యాహ్నం మూడుగంటలకు ప్రారంభమైంది. ఈ సభ కోసం సంఘ బంధం కార్యాలయ సీసీలు, వీవోఏలు రెండ్రోజులుగా గ్రామాల్లోకి వెళ్లి పొదుపు మహిళలపై ఒత్తిడి తెచ్చారు. కలిగిరి సభకు హాజరుకాకుంటే రుణాల మంజూరు సమయంలో సంతకాలు పెట్టం, పథకాలు వర్తింపజేయమంటే సోమవారం మధ్యాహ్నం 1గంటకల్లా రావాలంటూ హుకూం జారీ చేశారు. దీంతో మహిళలు ఉదయం 11గంటల నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే, స్కూలు ప్రాంగణంలో షామియానాలు సరిగ్గా ఏర్పాటు చేయక పోవడం, కుర్చీలు కూడా తక్కువగా ఉండటంతో వచ్చినవారంతా ఎండలోనే నిలబడాల్సి వచ్చింది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతుండగానే చాలా మంది మహిళలు నిలబడలేక తిరుగు ప్రయాణమయ్యారు. ఇది గమనించిన అధికారులు హైస్కూల్ గేటు మూసివేయడంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక నేతల సూచనలతో వీఓఏలు గేటు వద్దకు పరుగులు తీసి మహిళలను వెనక్కు రావాలని బతిమాలడం కనిపించింది. 'కుర్చీల్లేవు... కూడు లేదు, కాళ్ళు పీకుతున్నాయి, మేము ఇంటికెళ్లా'లంటూ బలవంతంగా గేటు నెట్టుక్కొని వెళ్లిపోయారు. మరో వైపు ఈ సభ కారణంగా మధ్యాహ్నం నుంచి తరగతులు జరగకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే ఉండిపోయారు.

● మర్రిపాడులో..

స్థానిక హైస్కూల్ ఆవరణలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికీ వెలుగు సిబ్బంది పొదుపు మహిళలను భారీగా తరలించారు. అన్ని గ్రామాల నుంచి మధ్యాహ్నం 1 గంటకు వచ్చిన మహిళలకు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేయకపోగా, మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లతో సరి పెట్టారు. సాయంత్రం 3.40 గంటలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీరిగ్గా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కాసేపటికి ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే వచ్చిన మహిళలు తిరుగుముఖం పట్టారు. ఎవరూ వెళ్లొద్దని మైకులలో అనౌన్స్ చేసినా ఫలితం లేకపోవడంతో పాఠశాల ప్రధాన గేటుకు వెలుగు సిబ్బంది తాళం వేసి మహిళలను అడ్డుకున్నారు. మరో వైపు పాఠశాల సమయం ముగియడంతో విద్యార్థులు గోడలు దూకి ఇళ్లకు వెళ్లారు.



మర్రిపాడులో నేలపై కూర్చొని..







కలిగిరి : గేటు మూయడంతో మహిళల వాగ్వాదం

మర్రిపాడు : మర్రిపాడు గేటుకు తాళం వేసి మహిళలను అడ్డుకుంటున్న వెలుగు సిబ్బంది, గోడ దూకి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

నిధులున్నా నీరసం

- కందుకూరులో రూ.31 కోట్లతో అభివృద్ధి పనులు
- బిల్లులపై అనుమానంతో కాంట్రాక్టర్ల వెనుకడుగు
- పూర్తి చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం
- అరకొర పనులతో పట్టణవాసుల అవస్థలు

కందుకూరు, జనవరి 29 : కందుకూరు పురపాలక సంఘంలో నిధులు మంజూరై ఉన్నా అభివృద్ధి పనులు జోరందుకోనంటున్నాయి. అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలో సిమెంటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.26 కోట్లకు తోడు మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్‌తో కలిపి మరో రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతోపాటు గాజులకాలువను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా అభివృద్ధి చేయడం, పార్కుల అభివృద్ధి వంటి పనులను ప్రతిపాదించారు. అయితే 2, 3 నెలల క్రితం చేసిన పనులు మినహా ప్రస్తుతం పనులు ప్రారంభించేందుకు ఎవరూ ఆసక్తి చూపకపోవటంతో మంజూరైన పనులలో మూడో వంతు కూడా పూర్తికాలేదు. చేసిన పనులను కూడా అరకొరగా చేసి వదిలేశారు. సిమెంటురోడ్లు నిర్మించిన చోట కనీసం సైడు బర్మ్‌లకు గ్రావెల్ కూడా తోలకుండా వదిలేశారు. వాహనాల రద్దీ అధికంగా ఉండే అనేకరోడ్లలో వాహనం ఎదురొస్తే మార్జిన్ దిగే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల స్థానికులే విరాళాలు వేసుకుని గ్రావెల్ తోలుకుంటున్న దుస్థితి ఉంది. వెంకటాద్రిపాలెంలో ఇదే జరిగింది. అయినా ఇవేమీ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు పట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పార్కుల అభివృద్ధి పనుల్లో అయితే సగం వరకు పనులు చేసి వదిలేసిన పరిస్థితి కావటంతో ప్రజాధనం వృథాఅయ్యే అవకాశం కూడా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

● అధికారుల అత్యుత్సాహం

కాంట్రాక్టర్లు అసంపూర్తి నిర్మాణాలతో వదిలేసినా ఇంజనీరింగ్ అధికారులు ఇదేమని అడగకుండా బిల్లులు చేయటం విశేషం. అసంపూర్తి పనులను కూడా పూర్తయినట్లు ఎంబుక్‌లలో రికార్డుచేసి ప్రభుత్వానికి నివేదించారన్న విమర్శలు ఉన్నాయి. ఎలాగూ పనులు పూర్తయ్యాయని నివేదిక వెళ్లింది కదా డబ్బు చేతికొస్తే ఆ తర్వాత చూద్దాంలే అన్న నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. బిల్లులు పెండింగ్‌పై ఉన్నతాధికారులపై స్థానిక ప్రజాప్రతినిధి చేస్తున్న ఒత్తిడి కారణంగా ఇటీవల రూ.10 కోట్లు విడుదల కాగా వాటిని సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు ఇంజనీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పనుల్లో నాణ్యత ఏదీ!?

మరోవైపు చేసిన పనులకు సరైన పర్యవేక్షణ లేక నాణ్యతాలోపాలు బయటపడుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ ప్రాంతంలో మురుగు కాలువ నిర్మించబోతున్నారు, మా ప్రాంతంలో సిమెంటు రోడ్డు నిర్మాణం జరగబోతోంది మా కష్టాలు ఇక తీరబోతున్నాయని ఎదురుచూసిన ప్రజలకు అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ల స్వార్థం కారణంగా తీవ్ర నిరాశే మిగులుతోంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పనులు చేయకూడదన్న ఆలోచనతో అనేకమంది కాంట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తగినచర్యలు చేపట్టి అభివృద్ధి పనులను వేగవంతం చేయించడంతో పాటు అసంపూర్తి పనులను తక్షణం పూర్తిచేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



చాకలికుంట రోడ్డులో సైడుబర్మ్‌లకు గ్రావెల్ తోలకపోవటంతో తోలిన పాతగృహాల వ్యర్థాలు

నేడు సర్పంచుల నిరసన దీక్ష

నెల్లూరు (హరనాథపురం) : తమ 16 డిమాండ్ల సాధన కోసం మంగళవారం నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు పంచాయతీ రాజ్ చాంబర్ సర్పంచుల సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కంద మూడి శివ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెళ్లి నమోదైనా బాదుడే!

'ఇళ్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు' అనే సామెత వాటి భారాన్ని తెలియచేస్తుంది. పెళ్లిళ్లు భారం కావడంతో గతంలో వారంపాటు జరిగే ఈ తంతును నేడు కొన్ని గంటల్లోనే ముగిస్తున్నారు. అతితక్కువ ఖర్చుతో జరిగే వివాహ రిజిస్ట్రేషన్లు కూడా జగనన్న బాదుడు నుంచి తప్పించుకోలేకపోయాయి. ప్రజల అభీష్టం మేరకు హిందూ వివాహ చట్టంలో మార్పులు చేస్తున్నామంటూ డిజిటలైజేషన్ సాకుగా చూపి రిజిస్ట్రేషన్ ఫీజులను వైసీపీ ప్రభుత్వం అమాంతం పెంచేసింది. దీనిపై గతేడాది డిసెంబరు 22న జీవో నెం.609ని గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేసింది. ఇది రిజిస్టర్ మ్యారేజీ చేసుకునేవారికి గుదిబండగా మారింది.

- వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచేసిన ప్రభుత్వం
- మూడు నుంచి నాలుగు రెట్లు ఒకేసారి పెంపు

వివాహ రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అనంతరం దరఖాస్తు పూరించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ స్లాట్ బుకింగ్‌కు రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే భారీగా పెరిగిన ఫీజులు వివరాలు వస్తున్నాయి. ఈ ఫీజులను చూసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునేవారు భయపడుతున్నారు. హిందూ వివాహ చట్టానికి 1955, 1965 సంవత్సరాలలో స్వల్ప సవరణలు చేసినా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులను మాత్రం అప్పటి ప్రభుత్వాలు పెంచలేదు. అయితే జగన్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖపై దృష్టి సారించి ఫీజుల పెంపును చేపట్టింది. సాధారణంగా హిందూ వివాహాలు ఆలయాలు, కల్యాణ మండపాలు, ఇళ్ల దగ్గర బంధువుల సమక్షంలోనూ జరుపుకోవటం ఆనవాయితీ. ఇలాంటి ఆడంబరాలు ఏమీ లేకుండా కొందరు రిజిస్ట్రార్ సమక్షంలో వివాహం చేసుకోవటం అనాదిగా వస్తున్నది. మరికొందరు బయట వివాహం చేసుకొని ఆ వివాహాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. విదేశాలకు వెళ్లి స్థిరపడాలనుకొనే వారు వివాహ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేసుకోవాలి. ఈ క్రమంలో వీటి పైఫీజులు పెంచి ఖజానా నింపుకోవాలని ప్రభుత్వం పూనుకుంది.


● రూ.200 చలానాతో...

వివాహ రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు గతంలో రూ.200కు చలానా తీసేవారు. దంపతులు అందించే ధ్రువీకరణ పత్రాలు, రికార్డుల పరిశీలన కోసం రూ. 50 చెల్లించాల్సి వచ్చేది. పెళ్లి చేసుకుంటున్న కల్యాణ మండపం, ఆలయానికే రిజిస్ట్రార్ నేరుగా వివాహానికి వచ్చి రిజిస్టర్ చేయాలంటే రూ.1,100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉండేది. ఇదంతా గతం. ప్రస్తుతం ఈ ఫీజులను ప్రభుత్వం మూడు నుంచి పది రేట్ల వరకు పెంచేసింది.

● పెరిగిన ఫీజులు ఇలా...

చలానా ఫీజు రూ.200 ఉంటే ఇప్పుడు ఏకంగా రూ.500లకు పెంచారు. దంపతులు అందించే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గతంలో రూ.10 ఉంటే ఇప్పుడు ఆ ఫీజును రూ.100కు పెంచారు. రికార్డుల తనిఖీకి రూ.10 ఉంటే రూ.100కు పెంచారు. వివాహం చేసుకుంటున్న కల్యాణ మండపానికి కానీ, ఆలయం వద్దకు కానీ రిజిస్ట్రార్ వస్తే ఫీజు రూ.1,100 చెల్లించాల్సి ఉండేది. ఈ ఫీజును నేడు రూ.5000 లకు పెంచారు. సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించాలనుకుంటే రూ.5000 చెల్లించాలి. వివాహ రిజిస్ట్రేషన్ల ఫీజులు భారీగా పెంపుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

- నెల్లూరు(హరనాథపురం)



పెరిగిన ఫీజులు అమలు చేస్తున్నాం..

వివాహ రిజిస్ట్రేషన్లకు పెరిగిన ఫీజులను అమలు చేస్తున్నాం. ఈ ఫీజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాని, ఆన్‌లైన్‌లో కాని చెల్లించి వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.



- భానుమతి, సబ్‌రిజిస్ట్రార్, నెల్లూరు

గ్రామకొలను.. ఎప్పటికి పూర్తయ్యేను!


పనులు నిలిచిన ఉదయగిరి ఆనకట్ట

● ఆగిన ఉదయగిరి ఆనకట్ట పనులు ● 50 శాతం మాత్రమే పూర్తి
● బిల్లులు అందక చేతులెత్తేసిన కాంట్రాక్టర్ ● పట్టణవాసులకు దక్కని ఆహ్లాదం

ఉదయగిరి రూరల్, జనవరి 29 : శ్రీకృష్ణదేవరాయుల హయాంలో ఉదయగిరి ముఖద్వారంలో నిర్మించిన ఆనకట్టను ఆధునీకరించాలన్న ఉద్దేశంతో గ్రామ కొలను పథకం కింద తలపెట్టిన పనులు నిధుల లేమితో నిలిచాయి. పనులు దక్కించుకొన్న కాంట్రాక్టరు చుట్టూ మట్టి కట్ట ఏర్పాటు చేసి 50 శాతం పనులు పూర్తి చేశారు. అయితే చేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో చేతులెత్తేశారు. 2021లో ఉమ్మడి జిల్లాలోని 47 మండలాల్లో చెరువులను ఉపాధి హామీ నిధులు రూ.75 కోట్లతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గ్రామకొలను పథకం కింద ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు శ్రీకారం చుట్టిన ఈ పనులను జలవనరుల శాఖ, డ్వామా అధికారులు సంయుక్తంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. అప్పట్లో కొందరు కాంట్రాక్టర్లు 30 నుంచి 40 శాతం పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోకపోవడంతో పనులను అర్ధంతరంగా ఆపేశారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కృషితో ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణకు రూ.15 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో చుట్టూ కట్ట ఎత్తు పెంచడంతోపాటు పటిష్టం, రివిట్‌మెంట్, వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్, పార్కు, మురుగు నీరు బయటకు పంపేందుకు డ్రైనేజీ కాలువ, పూడికతీత తదితర పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే నిధులు ఎక్కువ కావడంతో మంజూరుకు అవకాశం లేక అధికారులు రూ.9.40 కోట్లకు కుదించారు.

తొలుత చేసిన పనులకు కొంతమేర బిల్లులు రావడంతో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. కట్ట ఎత్తు పెంచడంతోపాటు చుట్టూ రాయితో రివిట్‌మెంట్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జరిగిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ఆపేవేశారు. ఎప్పటికి పనులు పూర్తవుతాయోనని ఉదయగిరి వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నిధులు మంజూరు కాకనే...

ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పనులకు సంబంధించి నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రమౌళి,
జలవనరుల శాఖ డీఈఈ

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి పెట్టండి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 29: జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సంబంధిత అధికారులను పిలిచి అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అవసరమైతే వ్యక్తిగతంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

● దివ్యాంగులకు ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలు అందచేయాలని దివ్యాంగ హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ రుణాల చెక్కులను ఆరు నెలల నుంచి అందచేయకుండా దివ్యాంగులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వచ్చే లోగా రుణాల చెక్కులు అందచేయాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

● విశ్రాంత ఉద్యోగుల సంఘం ధర్నాలో విఠపు

నెల్లూరు(హరనాథపురం) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట స్టేట్ గవర్నమెంటు పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో ఎప్పుడూ పెన్షనర్లు ధర్నాలు చేసిన దాఖలాలు లేవన్నారు. పెన్షనర్లు సంఘటితంగా ఉంటేనే డిమాండ్లు సాధించుకోగలరని అన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీస్ మూర్తి, బాబిరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజమన్నార్ పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 29: జిల్లా ఉపాధి కార్యాలయంలో నెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. కెరియర్ స్కూట్ హెచ్‌ఆర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఫైసాబజార్ మార్కెటింగ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, టెలిపర్‌ఫార్మన్స్ గ్లోబల్ సిరీస్ హైదరాబాద్, అల్‌ట్రస్ట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, ఇండోసెండ్ బ్యాంక్, ఒమేగా హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో చెన్నై, కోయంబత్తూర్, బెంగళూరు, హైదరాబాదు, పూనె, ముంబై ప్రాంతాల్లో ఐటీ, నాన్‌ఐటీ రంగాల్లో ఉద్యోగం కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీ రంగంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, టెక్నికల్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీ విద్యార్హత కలగిన వారు అర్హులని తెలిపారు. నాన్ ఐటీలో బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఇ కామర్స్, హెల్త్‌కేర్, టెలికమ్, సేల్స్, మార్కెటింగ్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ రంగాలలో వివిధ పోస్టులకు డిగ్రీ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

పోలీసు స్పందనకు 80 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), జనవరి 29: నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పోలీసు స్పందనకు జిల్లా వ్యాప్తంగా 80 మంది ఫిర్యాదుదారులు వచ్చి వారి సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను మభ్యపెట్టి వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తామని బెదరింపులకు గురిచేస్తూ బ్లాక్ మెయిల్ చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళా వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ ప్రసాద్

డప్పు కళాకారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలి

● కలెక్టరేట్ ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జనవరి 29 : డప్పు కళాకారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు చెందిన కోట్లాది రూపాయలను అమ్మఒడి పథకానికి మళ్లించి అభివృద్ధిని పాతాళానికి తొక్కేశారని ఆరోపించారు. తీన్‌మార్ ప్రవేశించటంతో కళాకారులు రోడ్డున పడ్డారన్నారు. దళిత, గిరిజన కళాకారులకు నెలకు రూ.5వేల పెన్షన్ వచ్చేలా చూడాలని కోరారు. ఈ ధర్నాలో నాయకులు పీ శ్రీనివాసులు, బిళ్ల మస్తానయ్య, శివయ్య, వృద్ధ కళాకారులు శివాజీ, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

ముందుగానే వెన్ను తీసిన వరి పైర్ల పరిశీలన

● పరిశోధనకు నమూనాల సేకరణ

విడవలూరు, జనవరి 29: నకిలీ విత్తనాలు చల్లి, ముందుగానే వెన్ను తీసిన వరి పైర్లను సోమవారం వ్యవసా పరిశోధన కేంద్రం ప్లాంట్ బ్రీడర్ శాస్త్రవేత్త శ్రీలక్ష్మి, వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత, నెల్లూరు వ్యవసాయ కార్యాలయ ఏడీఏ నర్సోజీ, వ్యవసాయాధికారి కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కమలాకర్, కోదండయ్యతో వారు మాట్లాడారు. విత్తనాలను ఎప్పుడు, ఎక్కడ కొనుగోలు చేశారు... ఎప్పుడు నాట్లు వేశారు.... అని అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కోవూరు ఏడీఏ సుజాత, శాస్త్ర వేత్త శ్రీలక్ష్మి మాట్లాడుతూ బీపీటీ 5204 వరి రకం 135 నుంచి 140 రోజులకు వెన్ను తీస్తుందని, అయితే రైతులు చెప్పిన ప్రకారం నాట్లు వేసిన 35 రోజులకే వెన్ను తీసిందన్నారు. కొన్ని వరి కంకులను పరిశోధన కోసం తీసుకుపోతున్నామన్నారు. వాటిని పరిశోధించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. అనంతరం వరి విత్తనాలు అమ్మిన డీలర్, ఉత్పత్తిదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.


ముందుగా వెన్ను తీసిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్త

కిడ్నాపర్ల గుట్టు రట్టు

● స్థానికుల సహకారంతో ఇద్దరు చిన్నారులు పోలీసులకు అప్పగింత
● అదుపులో కిడ్నాపర్లు

విడవలూరు, జనవరి 29: మండల పరిధిలోని రామతీర్థం, ఊటుకూరు గ్రామాల్లో చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్న ముఠా గుట్టు సోమవారం రట్టైంది. కిడ్నాపర్లను కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి సహకారంతో పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు, మండల పరిధిలోని ఊటుకూరులో ఏడేళ్లుగా చిత్తు కాగితాలు ఏరుకుని జీవిస్తున్న చెంచయ్య-రాములమ్మ దంపతులు ఆదివారం రాత్రి ఊటుకూరు బస్టాండ్ సమీపంలో నిద్రిస్తున్నారు. వారికున్న ఏడాది బాలుడు సోమవారం వేకువజామున కిడ్నాపునకు గురయ్యాడు. పిల్లవాడిని తీసుకునిపోయే సమయంలో అలికిడి కావడంతో తల్లిదండ్రులు పెద్దగా కేకలు వేశారు. అప్రమత్తమైన స్థానికులు కిడ్నాపునకు వచ్చిన ఇద్దరు మహిళలను, బాలుడిని పట్టుకున్నారు. స్థానిక నాయకుడు రామిరెడ్డి విజయభానురెడ్డి సాయంతో పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో శంకర్‌నగర్ గిరిజన కాలనీకి చెందిన ఓ మహిళపై, పెద్దపాళెంకి చెందిన మరో వ్యక్తిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. విచారణ నిమిత్తం నిందితురాలి ఇంటికి వెళ్లిన పోలీసులు అక్కడి దృశ్యాన్ని చూసి అవాక్కైయారు. ఆ ఇంటిలో ఇంతకుముందే నెల్లూరు రూరల్ మండలం ములుమూడికి చెందిన సత్యవేటి దుర్గారావు- వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు శ్యామ్ (5) ఉన్నాడు. వారం నుంచి ఆ బాలుడు ఆ ఇంటిలోనే ఉన్నట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పోలీసుల అదుపులో ఉన్న బాలుడు

బెల్టు షాపుపై దాడి : 15 మద్యం సీసాల స్వాధీనం

కొండాపురం, జనవరి 29: మద్యం అక్రమంగా అమ్ముతున్న బెల్టుషాపుపై ఎస్సై ఖాజావలి సోమవారం తన సిబ్బందితో దాడిచేశారు. ఈ దాడిలో 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తూర్పుఎర్రబల్లిలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. దీంతో తాము దాడిచేయగా 15 సీసాలు దొరికాయన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను సీజ్ చేశామన్నారు.

హైవేపై కంపు.. కంపు!

● మినీ లారీలో కోళ్ల వ్యర్థాల తరలింపు

మర్రిపాడు, జనవరి 29 : చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న ఓ మినీలారీ సోమవారం ఉదయం డీసీపల్లి వద్ద ప్రమాదానికి గురైంది. అందులో నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానికులే కాకుండా వాహనదారులూ అవస్థలు పడ్డారు. కర్నాటక నుంచి నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి మీదుగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈ కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. రోజుకు కనీసం 30 నుంచి 40 లారీలలో ఈ వ్యర్థాలను తరలిస్తుంటారు. అయితే, తరచూ సదరు లారీలు వివిధ కారణాలతో హైవేపై ఆగిపోతున్నాయి. ఆ సమయంలో వస్తున్న దుర్వాసనను భరించలేక స్థానికులు అవస్థలు పడుతుండగా, సమీపంలోని దుకాణాలు మూసేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాల రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వ్యర్థాలను తరలిస్తూ రోడ్డుపై ఆగిపోయిన మినీ లారీ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	260
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5963
వెండి కిలో ధర	రూ. 73,300
వెండి ఒక గ్రాము	రూ. 75.30

జ్యుడీషియల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(లీగల్), జనవరి 29: జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పీవీ.నారాయణరెడ్డి, కోశాధికారిగా కేవీ.సునీల్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంవీ.శివకుమార్, ఉపాధ్యక్షులుగా వీ.వెంకటేశ్వర్లు, సీహెచ్.పోలయ్య, ఎస్‌కే.షఫీ, సీహెచ్ వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా బీ.సురేంద్రబాబు యాదవ్, బీ.దినేష్ కుమార్, ఎస్.శివయ్య, ఏ.మల్లికార్జున ఎన్నికయ్యారు. మార్చి 1వ తేదీన అధ్యక్షుడు, కార్యనిర్వాహక కార్యదర్శి పదవులకు ఎన్నిక జరుగనున్నది. ఎన్నికల అధికారులుగా సీనియర్ ఉద్యోగులు కే.నరసింహారావు, టీ.రవికుమార్‌లను నియమించారు.

'రా.. కదలిరా..' అదిరింది!

● కాకాణికి కళ్లు కనిపించడం లేదు : సోమిరెడ్డి

నెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో నిర్వహించిన 'రా.. కదలిరా..' సభ అదిరిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. షెడ్యూల్ కంటే చాలా ఆలస్యమైనా చంద్రబాబు ప్రసంగం వినేందుకు ప్రజలు ఎండను కూడా లెక్క చేయలేదని పేర్కొన్నారు. ఎస్వీజీఎస్ మైదానం ప్రజలతో కిక్కిరిసిపోయినా మంత్రి కాకాణికి కళ్లు కనిపించడం లేదని విమర్శించారు. కాకాణి బ్రో.. ఎందుకైనా మంచిది కంటి ఆపరేషన్ చేయించుకో అంటూ సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నాకిచ్చిన కోటి రూపాయలు లెక్కపెట్టలేక ఇబ్బంది పడుతున్నా. నీ కరోనా హౌస్‌లో కొత్తగా తెచ్చిన కౌంటింగ్ మిషన్ పంపుతావా..' అంటూ కాకాణిపై వ్యంగ్యంగా మాట్లాడారు. కల్తీ మద్యం కేసు నుంచి తప్పించమని రెండేళ్ల తమ నాయకుడు చంద్రబాబు ఇంటి చుట్టూ తిరిగి కాళ్లు పట్టుకున్న చరిత్ర కాకాణిది అని విమర్శించారు. అటువంటి వ్యక్తి తమ నాయకుడిని చర్చకు పిలవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు టార్పలిన్ పట్టలు కూడా ఇవ్వలేని వ్యవసాయ శాఖ మంత్రి వ్యవసాయంపై చర్చకు పిలవడం విడ్డూరంగా ఉం దని మండిపడ్డారు. ఎన్నికల తర్వాత కాకాణి జైలుకెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. కాకాణి తిట్లే తనకు ఆశీర్వాదమని, ఆ తిట్ల తోనే తాను సర్వేపల్లిలో గెలవబోతున్నానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొమ్మి సురేంద్ర, మామిళ్లపల్లి శ్రీనివాసులు నాయుడు, కొల్లారు బాలకృష్ణ చౌదరి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

5 నుంచి ట్రెజరీ ఉద్యోగుల క్రీడా పోటీలు

● గోడపత్రిక ఆవిష్కరించిన డీడీ


నెల్లూరు(హరనాథపురం), జనవరి 29 : నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలో ఫిబ్రవరి 5, 6 తేదీలలో జిల్లా ఖజానా శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ట్రెజరీ శాఖ ఉపసంచాలకుడు గంగాద్రి తెలిపారు. ఈ మేరకు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సోమవారం ఆయన ట్రెజరీ ఉద్యోగుల క్రీడాపోటీల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాద్రి మాట్లాడుతూ ఈ ఆటల పోటీలలో జిల్లా ఖజానా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీవో బీ.లోకేష్‌బాబు, ఖజానా ఉద్యోగుల సంఘం నాయకులు డి.రమణారెడ్డి, గోడ సుబ్రహ్మణ్యం, పి.కిరణ్‌కుమార్, ఎస్‌డీ రెహమన్, ఎస్‌కే జిలానీ, వై.దయాకర్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


క్రీడా పోటీల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ట్రెజరీ డీడీ గంగాద్రి, ఉద్యోగులు

రాళ్లతిప్పను తవ్వేస్తున్నారు!

● దేవరపాళెంలో విచ్చలవిడిగా గ్రావెల్ తరలింపు ● పట్టపగలే యథేచ్ఛగా రవాణా
● రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలకు ముడుపులు...?

నెల్లూరు రూరల్, జనవరి 29 : కోట, వాకాడులో సిలికా... పొదలకూరు, సైదాపురంలో తెల్లరాయి... సర్వేపల్లిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడిన అధికార వైసీపీ నాయకులు వాటికి ఏ మాత్రం తీసిపోని విధంగా నెల్లూరు రూరల్లోని దేవరపాళెంలో పోరంబోకు తిప్పను తవ్వేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో రాత్రి, పగలు తేడాలేకుండా విచ్చలవిడిగా తిప్పను తవ్వి మట్టిని తరలించేస్తున్నారు. తద్వారా రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వెలసియున్న దేవరపాళెం (నరసింహకొండ) గ్రామంలో రాళ్లతిప్ప పేరిట ప్రభుత్వ పోరంబోకు స్థలంలో తిప్ప ఉంది. నాణ్యమైన గ్రావెల్ సహజంగా ఏర్పడటంతో దానిపై వైసీపీ నాయకుల కన్నుపడింది. ప్రస్తుతం వైసీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇక్కడి నాయకులు టిప్పర్ల ద్వారా గ్రావెల్ మట్టిని పంట పొలాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు అమ్మేస్తున్నారు. పట్టపగలే పదుల సంఖ్యలో టిప్పర్లు గ్రావెల్ మట్టిని తరలించేస్తున్నా చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు మామూళ్లకు పరిమితమైనట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఈ అక్రమ తవ్వకాలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఉండేందుకు మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, జిల్లా స్థాయిలో మైనింగ్ అధికారులకు ముడుపులు అందచేస్తున్నట్లు విమర్శలున్నాయి. సహజ వనరులను నిలువుదోపిడీ చేస్తున్నా కన్నెత్తి చూడలేని దయనీయ దుస్థితిలో అధికార యంత్రాంగం ఉందంటూ గ్రామస్థులు వాపోతున్నారు.


రాళ్లతిప్ప నుంచి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్

కావేరీ సీడ్స్ లైసెన్సు రద్దు

మనుబోలు, జనవరి 29: నెల్లూరులోని కావేరి సీడ్స్ దుకాణం లైసెన్సు రద్దుచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి సోమవారం ఉత్తర్వులు జారీచేసినట్లు మనుబోలు మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. బీపీటీలని చెప్పి చెర్లోపల్లి రైతులకు కావేరి సీడ్స్ నకిలీ విత్తనాలు విక్రయించింది. ఆ విత్తనాలను పండిస్తే 70 రోజులకు రావాల్సిన వెన్ను 50 రోజులకే తీయడంతో పంట దెబ్బతింది. దీనిని గుర్తించిన రైతులు ఆందోళన చేశారు. స్పందించిన వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పలు దఫాలుగా నకిలీ విత్తనాల పంటలను పరిశీలించి కావేరి సీడ్స్ రైతులకు బీపీటీల పేరుతో ఏదో రకం విత్తనాలను అంటగట్టిందని తేల్చారు. దీని ఆధారంగా జేడీ ఉన్నతాధికారుల ఆదేశాలతో కావేరి సీడ్స్ లైసెన్సు రద్దుచేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కావేరి సీడ్స్ ఎలాంటి అమ్మకాలు జరపవద్దని హెచ్చరించారు. నకిలీ విత్తనాలుగా తేలుస్తూ రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు ఏవో తెలిపారు.

విడవలూరు ఎంపీపీ భవానమ్మ మృతి

● నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు

విడవలూరు, జనవరి 29 : విడవలూరు ఎంపీపీ వేణుంబాకం భవానమ్మ(78) అనారోగ్యంతో సోమవారం వేకువజామున మృతిచెందారు. ఆమె పార్థివ దేహాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ భానుప్రకాష్, టీడీపీ నాయకులు పొన్నలూరు పురందరరెడ్డి, వైసీపీ నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డిలు సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ నేత్రాలను కుటుంబ సభ్యులు మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో దానం చేశారు. నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు వేణు సేకరించారు.



ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి


రైలులో తనిఖీలు చేస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

బిట్రగుంట, జనవరి 29: రైల్వే ఆస్తులపైన, రైలు ప్రయాణికుల భద్రతపైన ప్రత్యేక దృష్టి పెట్టామని ఆర్పీఎఫ్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆయన సిబ్బందితో కలసి విస్తృత తనిఖీ చేపట్టారు. స్టేషన్‌పరిధిలోనే కాకుండా రైలు బోగీలు, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేశామని ఆయన తెలిపారు.

పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం

● పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపులు ● పట్టించుకోని యంత్రాంగం

ఉదయగిరి రూరల్, జనవరి 29: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. మద్యం ఏరులై పారుతోంది. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు తదితర మండలాల్లోని అన్ని గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది. మద్యం విక్రయాలు చేస్తున్నారని అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్కువ విక్రయాలు జరగాలనే ప్రభుత్వ ఆదేశాలతోనే బెల్టుషాపుల నిర్వహణకు పరోక్షంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది చేతివాటం: మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సిబ్బంది గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించే వారితో సత్సంబంధాలు ఏర్పరుచుకొని చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు సీసాకు రూ.10ల చొప్పున సిబ్బందికి ముట్టజెప్పుతుండడంతో వారడిగినంత మద్యం అందజేస్తున్నారు.

అధిక ధరకు విక్రయాలు

మద్యం బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో సీసాపై రూ. 50 నుంచి రూ.80ల అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా గండిపాళెం, వెంగళరావునగర్, శకునాలపల్లి, కృష్ణంపల్లి, ఉదయగిరి, అయ్యవారిపల్లి, చెరువుపల్లి, పోలంగారిపల్లి, నందిపాడు, నర్రవాడ, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో జోరుగా



ఉదయగిరి పట్టణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు(ఫైల్)

మద్యం బెల్టు దుకాణాలు నడుస్తున్నాయి. ఉదయగిరి పట్టణంలో తెల్లవారుజాము 5 గంటల నుంచే మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మద్యం బెల్టు దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా వెంగమాంబ కల్యాణం



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 29: నర్రవాడలో వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తపేట గ్రామ శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో వెంగమాంబ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. గ్రామస్థులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 29: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన మద్దిరెడ్డి కొండమ్మ, సుబ్బారెడ్డిలకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ దశలో ఉంది. ఈ తరుణంలో ఒక్కసారిగా బ్యారన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఆరు క్వింటాళ్ల పొగాకు, 1100 కర్ర, ఇతరత్రా సామాగ్రి అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకొంటున్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

ఉదయగిరి రూరల్, జనవరి 29: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టోర్‌రూమ్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వాహనం అందుబాటులో లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది తాజుద్దీన్, స్వరూప్‌బాబులు అక్కడికి చేరుకొని యువకుల సహాయంతో మంటలను అదుపు చేశారు.

కార్మికుల నిరసన

ఉదయగిరి, జనవరి 29: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం ఎన్‌ఎంయూ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. విశాఖలో ఎన్‌ఎంయూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ప్రెసిడెంట్ నాగరాజు, నాయకులు సూర్య నారాయణ, రమణారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వరికుంటపాడు, జనవరి 29: పంచాయతీలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, మురికి కాలువల సౌకర్యానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. త్వరలో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమీర్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి : గొంగటి

వింజమూరు, జనవరి 29 : అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ మండల అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి సవాల్ విసిరారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో సోమవారం గొంగటి రఘునాథరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ హయాంలో వాటర్ ప్లాంట్‌కు అన్ని సమకూరిస్తే మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేసి ప్రారంభోత్సవం చేయడం వైసీపీకే చెల్లిందన్నారు. గ్రామంలో రోడ్లు టీడీపీ హయాంలోనే వేశామని తెలిపారు. ఈ సమా వేశంలో నాయకులు గూడా నర్సారెడ్డి, వెంకటేశ్వర్లు, కొండపల్లి వెంకటేశ్వర్లు, ఓంకారం వేణుగోపాల్, జయన్న, తిరుపతి ఆచారి, ఎమ్మెస్ నాయుడు, అరికొండ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ఉదయగిరి రూరల్, జనవరి 29: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోల చేతుల మీదుగా అవార్డు పొందిన మండల వైద్యాధికారిణి శివకల్పనను సోమవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ గొల్లపల్లి కల్పన, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు సరోజరాణి, హెల్త్ అసిస్టెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం ప్రవీణ్‌విజయ్ అవార్డు పొందడంతో సన్మానించారు. సోమవారం ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకన్య, న్యాయవాదులు సందిరెడ్డి రామారావు, షరీఫ్‌లు ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు.

విజేతలకు అభినందనలు

సంగం, జనవరి 29: నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన గాంధీజన సంఘం ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి ప్రియాంక, టి వెంకట శిరీషలను ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి సోమవారం అభినందించారు. వారిని ఉపాధ్యాయులు కూడా అభినందించారు.

పరీక్షలపై అవగాహన

అనంతసాగరం, జనవరి 29: మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరీక్షపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు.

సంగం తహసీల్దారుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

సంగం, జనవరి 29: సంగం గ్రామంలో సర్వే నెంబరు 273లోని ప్రభుత్వ భూమిలో వేసిన అక్రమ లేఅవుట్‌ను పట్టా భూమిగా ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్టు రేణుకారెడ్డి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. స్పందించిన కలెక్టర్ 273 సర్వే నెంబరుపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తప్పు జరిగితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సంగం గ్రామానికి చెందిన రైతులు కాకు మధుసూదన్ యాదవ్, ప్రసాదు, మస్తానయ్య ఉన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి, జనవరి 29: మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్నుల వసూళ్లపై దృష్టిసారించాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో రూ.51,04,477 ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.6,61,533 వసూలు చేయడం జరిగిందన్నారు. మేజర్ పంచాయతీ ఉదయగిరిలో రూ.34 లక్షలకు గాను రూ.2 లక్షలు వసూలైందని, మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని ఆయన సూచించారు.

లబ్ధిదారుల నుంచి నగదు వసూళ్లు అన్యాయం

ఉదయగిరి రూరల్, జనవరి 29: ప్రధానమంత్రి విశ్వకర్మ యో జన పథకం లబ్ధిదారుల నుంచి అక్ర మంగా నగదు వసూళ్లు చేయడం అన్యాయమని మండల బీజేపీ కన్వీనర్, గన్నేపల్లి సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామినాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విశ్వ కర్మ యోజన పథకానికి ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చేందుకు ఉదయ గిరిలో అధికారికంగా బీసీ బాలుర వసతిగృహంలో కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. కానీ అనధికారికంగా కొందరు పట్టణంలోని మరో ప్రాంతంలో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసి లబ్ధిదారుల నుంచి అక్రమంగా నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని, తాను కేంద్రం వద్దకెళ్లి అనుమతులు చూపించాలని కోరగా వారి వద్ద ఎలాంటి ఆధారాల్లేవన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులను అడగ్గా ఉదయగిరికి ఒక్క శిక్షణ కేంద్రం మాత్రమే మంజూరైందని తెలిపారు. దీంతో అనధికారికంగా నిర్వహిస్తున్న కేంద్రంపై చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లగా ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేంద్రం వద్దకు వెళ్లి విచారణ చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సయ్యద్ షాజహాన్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జలసంఘంతో నీటి సమస్యల పరిష్కారం

అనంతసాగరం, జనవరి 29: నూతనంగా ఏర్పాటుచేసిన గ్రామ జలసంఘంతో నీటి సమస్యలు పరిష్కారం అవుతున్నట్లు అనంతసాగరం ఎంపీపీ సంపూర్ణమ్మ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జల సంఘం సభ్యులైన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి ఇబ్బందులను గుర్తించి జలజీవన్ మిషన్ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

నేతల నిర్వాకంతో పతనమవుతున్న వైసీపీ

● వరికుంటపాడు జడ్పీటీసీ ఆగ్రహం



మాట్లాడుతున్న జడ్పీటీసీ నాగేంద్ర

వరికుంటపాడు, జనవరి 29: మండలంలోని కొంతమంది నాయకుల ప్రవర్తనతో వైసీపీ నాశనమయ్యే రోజులు దగ్గర పడ్డాయని సాక్షాత్తూ అదే పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన తనకు ఎలాంటి సమాచారం లేకుండానే తన సొంత పంచాయతీ రామాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం పనులను మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని వాపోయారు. అధిష్ఠానం జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దకపోతే అన్ని పంచాయతీల్లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితులు ఏర్పడతాయని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, మాజీ మండల వైసీపీ కన్వీనర్లు గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, మానం మస్తానయ్య, కాశౌ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ భూ పంపిణీ : ఎమ్మెల్యే



ఆత్మకూరు : నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అసైన్‌మెంట్ ద్వారా భూపంపిణీ జరిగే విధంగా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీవో కె మధులతతో కలిసి నియోకవర్గంలోని అన్ని మండలాల తహశీల్దార్లు, వైసీపీ రెవెన్యూ సమన్వయ కమిటీ కన్వీనర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపంపిణీకి అర్హుల జాబితాను పరిశీలించి మంగళవారం సాయంత్రానికి ఆర్డీవోకు అందజేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా సంబరాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ప్రతిపక్షమంటే అలుసా..?



ఎంపీడీవో గదికి వినతిపత్రం అంటిస్తున్న సర్పంచి తనయుడు

వరికుంటపాడు, జనవరి 29: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడే ప్రతిపక్ష టీడీపీ సర్పంచ్‌లంటే అధికారులకు అలుసా అంటూ సోమవారం రామాపురం పంచాయతీ సర్పంచ్ తనయుడు అరికొండ వెంకటరత్నం అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పంచాయతీ సర్పంచ్ ప్రమేయం లేకుండానే ఎంపీడీవో కొంతమందికి తీర్మానాలను ఇస్తున్నారన్న సమాచారంతో తాను వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాలయానికి వచ్చినప్పటికీ సరైన స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన పనులకు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తీర్మానాలు ఇచ్చేందుకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఎంపీడీవో నుంచి స్పందన లేకపోవడంతో కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా వారు తీసుకోకపోవడంతో తీవ్ర అసహనానికి గురై ఎంపీడీవో కార్యాలయ గది గోడకు ఆ వినతిపత్రాన్ని అంటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

11 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, జనవరి 29: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మద్దిశెట్టి వెంకటేశ్వర్లును సోమవారం తెల్లవారుజామున ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి అరెస్టు చేశారు. కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడని అందిన సమాచారం మేరకు సిబ్బంది దాడులు నిర్వహించగా 11 మద్యం సీసాలు దొరికాయని, దీంతో అరెస్టు చేశామని తెలిపారు.

ఓట్ల తొలగింపునకు కుట్ర : ఇంటూరి



విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

కందుకూరు, జనవరి 29: కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరు మండలంలోని పలుకూరు, పట్టణంలో చనిపోయిన వ్యక్తుల పేర్లుతో ఫారం 7లు పెట్టించారని, తాజాగా లింగసముద్రం మండలం చినపవనిలో 49మంది టీడీపీ కార్యకర్తల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించారని ఆయన చెప్పారు. చినపవనికి సంబంధం లేని ఎమ్మెల్యే కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓవ్యక్తితో ఫారం7లు పెట్టించి విద్యార్థులు, తాత్కాలిక వలసలు పోయిన వ్యక్తుల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. సమావేశంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ,జి. మోషే, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధిలో కావలి అట్టడుగు.. అవినీతిలో ముందడుగు : జనసేన



మాట్లాడుతున్న సిద్దూ

కావలి, జనవరి 29: కావలి నియోజకవర్గం అభివృద్ధిలో అట్టడుగున ఉండగా, అవినీతిలో మాత్రం ముందడుగులో ఉందని జనసేన ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు సిద్దూ తెలిపారు. పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్ రెడ్డి 10 కి.మీ తుమ్మలపెంట రోడ్డును వేయలేక పోయారన్నారు. జనంలోకి జనసేనలో భాగంగా సోమవారం ఆయన కావలి రూరల్ మండలం శ్రీరాంపురంలో పర్యటించారు. అక్కడ జరిగిన సభలో సిద్దూ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు తోట వెంకటశేషయ్య, తిరుపతి స్వామి, చంటి, లక్ష్మణ్, రామకృష్ణ, జయరామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● మీరు బాక్సింగ్ చేస్తే.. మేం ఫుట్‌బాల్ ఆడుతాం !

భీమిలిలో జగన్ నిర్వహించిన సిద్ధం బహిరంగసభలో పవన్, చంద్రబాబు ఫొటోలతో బాక్సింగ్ చేస్తున్నట్లు ఫ్లెక్సీలు పెట్టి శునకానందం పొందటం చూస్తే జగన్ పిచ్చి పరాకాష్టకు చేరినట్లు ఉందని జనసేన కావలి నియోజకవర్గ అధికార ప్రతినిధి రిషికేష్ తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము కూడా జగన్ బొమ్మలతో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఆడినట్లు ఫ్లెక్సీలు వేసి వీధికొకటి పెట్టగలమన్నారు. అయితే జనసేన మాకు క్రమశిక్షణ నేర్పిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన అధికారంలోకి రావటం ఖాయమన్నారు. సమావేశంలో జనసేన నాయకులు తిరుమలశెట్టి సుదీర్, బెల్లంకొండ మస్తాన్‌బాబు, కృష్ణయ్య, జానీ, సమీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నారా భువనేశ్వరి పర్యటన

● ఉలవపాడు, గుడ్లూరు, కొండాపురం మండలాల్లో 'నిజం గెలవాలి'

కందుకూరు, జనవరి 29 : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధ, గురువారాల్లో కందుకూరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో తీవ్ర మనోవేదనకు గురై మృతి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించనున్నారని పేర్కొన్నారు. 31న సాయంత్రం ఉలవపాడు మండలం ఆత్మకూరు, టెంకాయచెట్లపాలెం గ్రామాలలో పర్యటిస్తారని తెలిపారు. రాత్రికి కందుకూరులో బసచేసి ఫిబ్రవరి 1న ఉదయం గుడ్లూరు, దారకానిపాడు గ్రామాలలో కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారని తెలిపారు. భువనేశ్వరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● 1న కొండాపురంలో..

కొండాపురం : చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఫిబ్రవరి 1న మండలంలో పర్యటిస్తారని మండల టీడీపీ కన్వీనర్ ఎమ్.ఓంకారం, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మరణించిన తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆ రోజు ఆమె కొమ్మి గ్రామానికి వస్తారని తెలిపారు. మండల టీడీపీ నాయకులు, తెలుగుమహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో అల్లూరుకు బహుమతులు



అల్లూరు : బహుమతులు పొందిన విద్యార్థినులతో ఎంపీడీవో జ్యోతి తదితరులు

అల్లూరు, జనవరి 29 : ఆడుదాం ఆంధ్రాలో అల్లూరు మండలానికి బహుమతులు వచ్చినట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. సోమవారం విజేతలను ఆమె తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఖోఖోలో బాలికల విభాగంలో ప్రథమ బహుమతిని, క్రికెట్, బాడ్మింటన్‌లో బాలుర విభాగంలో ద్వితీయ బహుమతులు, ఖోఖో,కబడ్డీల్లో బాలికల విభాగంలో మూడవ బహుమతులు, కబడ్డీ బాలుర విభాగంలో ద్వితీయ బహుమతి, బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించిన ట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మంలో కార్యాలయ సిబ్బంది నాగరాజు, పీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కావలి టౌన్ : క్రీడా విజేతలను అభినందిస్తున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

● క్రీడా విజేతలకు అభినందనలు

కావలి టౌన్, జనవరి29: వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన పీజీ కళాశాల క్రీడాకారులకు సోమవారం కళాశాలలో అభినందించారు. పీడీ మణికంఠ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు విజేతలను జ్ఞాపికలతో అభినందించారు. ఆయన మాట్లాడుతూ పీజీ కళాశాల విద్యార్థులు క్రీడాపోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పీడీ మణికంఠను ప్రత్యేకంగా అభినందించారు.

కావలి నృత్యకారిణులకు స్వర్ణనంది పురస్కారాలు



స్వర్ణనంది పురస్కారాలు అందుకున్న కావలి చిన్నారులు

కావలిటౌన్, జనవరి29: స్థానిక శ్రీవిఘ్నేశ్వర నృత్య కళా నిలయానికి చెందిన నృత్యకారిణులకు స్వర్ణనంది పురస్కారాలు లభించాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆది, సోమవారాల్లో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్కృతి, సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కావలి చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. నాట్యాచార్యులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాట్యాచారిణి ఎం శివాని శిష్య బృందం అక్షయ, నాఫియ, లాస్యప్రియ, సాయిశిరి హేమన్య, గ్రీష్మ, చైత్ర, జి గిరిణి, హర్షిణి, తుషారపా ల్గొని ఉత్తమ నాట్య ప్రదర్శన చేశారని తెలిపారు. దీంతో వారు మాజీ మంత్రి, సినీ నటులు బాబుమోహన్ చేతుల మీదుగా స్వర్ణనంది పురస్కారాలు అందుకున్నారని ఆయన వివరించారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కందుకూరు, జనవరి 29: కందుకూరు మున్సిపాలిటీ, రూరల్ మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు నాల్గవ ఏడాది రుణమాఫీ కింద ఆసరా చెక్కుల పంపిణీని సోమవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులను అందజేశారు. అనంతరం ఉజ్వల్ పథకం కింద పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, డీఆర్‌డీఏ- వెలుగు అధికారులు, ఎంపీపీ ఇంటూరి సుశీల, జడ్పీటీసీ, టి. అనసూయ తదితరులు పాల్గొన్నారు.

● ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

ఈ సందర్భంగా వికసిత భారత్ సంకల్పయాత్ర ప్రచారరథం కందుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల సురేష్, జె. వైకుంఠం తదితరుల చేతుల మీదుగా ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట : బోగోలు మండలం రామస్వామిపాలెంలోని రామలింగేశ్వరుడికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వరహాలచల సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరుడికి పంచామృత, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు రవిచంద్ర దంపతులకు అర్చకులు ఆశీర్వాదం ఇచ్చారు. ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.


చలో విజయవాడ కరపత్రాల ఆవిష్కరణ

ఉలవపాడు : చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం పెద్దపట్టపుపాలెం హైస్కూల్‌లో భోజన విరామ సమయంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగిందని బీటీఏ మండల అధ్యక్షుడు పున్నెపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని , పైగా కాలయాపన చేస్తున్నందున బీటీఏ ఫిబ్రవరి 5న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధన్యాసి మురళీమోహన్, సలీం భాష, సుదర్శి భాస్కర్, ఎద్దు శ్రీనివాసులు, దాసరి బాలయ్య, వెలిచర్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగసముద్రం, జనవరి 29 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్టేట్ రిసోర్స్ పర్సన్ కే వెంకయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ అధికారులైన డీఆర్‌పీలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కూలీలను విచారించి, పనులను కూడా తనిఖీ చేస్తారని చెప్పారు. గ్రామసభలు నిర్వహించి, విచారణ నివేదికలను ప్రజలకు తెలియచేస్తారని తెలిపారు. డ్వామా అధికారి సమక్షంలో ఈ విచారణ నివేదికలను వివరిస్తామని ఆయన చెప్పారు.

రాజీవ్‌నగర్ పార్కును పట్టించుకోండి



కమిషనర్‌కి వినతిపత్రం ఇచ్చిన రాజీవ్‌నగర్ వాసులు

కావలి, జనవరి 29 : మద్యం, గంజాయి ప్రియులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాతూరులోని రాజీవ్‌నగర్ పార్కు అడ్డాగా మారిందని ఆ ప్రాంతవాసులు వాపోయారు. సోమవారం వారు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ పార్కును పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరిందన్నారు. స్పందించిన కమిషనర్ పార్కు అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ వాసులు కొల్లి శ్రీనివాసులు, తోట శరణ్, టీ. వినయ్, కోల కమలేష్, బాలు, కొల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

లింగసముద్రం, జనవరి 29: లింగసముద్రంలో బాలికపై అత్యాచారయత్నం చేసిన నిందితుడు తమ్మినేని ఉమాశంకర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సంఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సోమవారం మధ్యాహ్నం నిందితుడు ఉమాశంకర్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఎం బాజీబాబు చెప్పారు.రిమాండ్ నిమిత్తం కోర్టులో ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

లింగసముద్రం, జనవరి 29 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యు శేషుబాబు, వైఎస్ఆర్ క్రాంతిపథం ఏపీఎం కె సింహాద్రిరావు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరౌతారని తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, జనవరి 29: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అనివేటి మండపం నిర్మాణం కోసం కంకణాల నారాయణ, అఖిల దంపతులు సోమవారం రూ. 25,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, తల్లపనేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీల ఎన్నిక

ఉలవపాడు : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీల ఎన్నిక జరిగిందని మహాజన సోషలిస్టు పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావినూతల ముత్తు మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రావినూతల సతీష్‌మాదిగ, పున్నెపల్లి పేరయ్య మాదిగలను ఎన్నుకోగా, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా కేరేటి గోపాల్ మాదిగను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాల మాదిగ, కందుకూరు డివిజన్ ఎంఈఎఫ్ అధ్యక్షుడు జడ రాములు, శ్రీను, రాజేష్, ఏలియా, అశోక్, టోనీ, జగదీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మారిన అధికారుల ఫోన్ నెంబర్లు

కందుకూరు : కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు రెవెన్యూ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఫోన్‌నెంబర్లు వివరాలు... సబ్‌కలెక్టరు-87126 22671, సబ్‌కలెక్టరు కార్యాలయ ఏవో - 8712622672, కందుకూరు తహసీల్దార్-8712622673, గుడ్లూరు తహసీల్దార్ -8712622674, లింగసముద్రం తహసీల్దార్- 8712622 675,ఉలవపాడు తహసీల్దార్-8712622676, వలేటివారిపాలెం తహసీల్దార్ -8712622677, స్పెషల్ తహసీల్దార్- 8712622679 అని పేర్కొన్నారు.

దళితుల పక్షపాతి చంద్రబాబు

కందుకూరు : దళితుల పక్షపాతి చంద్రబాబు కాగా, దళితద్రోహి జగన్మోహనరెడ్డి అని ఈ నాలు గేళ్లలో నిరూపితమైందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉండగా అప్పట్లో సీఎం చంద్రబాబు దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇన్నోవా కార్లు, ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు, బ్యాంకు లింకేజీ పథకంతో 60 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. జగన్మోహనరెడ్డి 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దగా చేశాడన్నారు.

కరకట్టలకు మరమ్మతులు చేయండి : టీడీపీ

విడవలూరు, జనవరి 29: దెబ్బతిన్న ఈస్ట్రన్ చానల్ కరకట్టలకు వెంటనే మరమ్మతులు చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, రైతు సంఘం నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. విడవలూరు సమీపంలోని 14.25 మైలు వద్ద దెబ్బతిన్న కరకట్టను సోమవారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విడవలూరు మండలంలో కరకట్టల మరమ్మతులకు, కాలువల్లో పూడికతీతకు ఎఫ్‌డీఆర్ కింద సుమారు రూ.30కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇరిగేషన్ అధికారులు, వైసీపీ నేతలతో కుమ్మక్కై కాలువలను మరమ్మతులు చేయకుండా నిధులను పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. దీంతో కాలువలకు నీరు వదిలితే పొంగి పొలాలపైకి వస్తున్నాయన్నారు. ఎఫ్‌డీఆర్ నిధులపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరపాలని వారు కోరారు. లేకుంటే స్థానిక రైతులతో కలసి ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, కోపర్తి హరనాథ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



కరకట్టలను పరిశీలిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

వెంకటాచలం, జనవరి 29: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వీ ప్రసాద్‌రావు ఆకాంక్షించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇటీవల కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందుకున్న జువాలజీ అధ్యాపకుడు సురేంద్ర, బైపీసీ విద్యార్థిని బీ శ్రావ్యకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కళాశాల నుండి మరింత మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరచాలని కోరారు. కార్యక్రమంలో సింహపురి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ జీ దయాకర్‌రావు, విశ్రాంత డీఎస్పీ ప్రభాకర్‌రావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం

రాపూరు(డక్కిలి), జనవరి 29 : ఎన్నికల కోడ్ ఇంకా అమల్లోకి రాకపోయినా పోలీసులు మాత్రం తనిఖీలు ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితం రాపూరు పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ 3.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కూడా సీఐ మలిశెట్టి సుబ్రమణ్యం రాపూరు- రాజంపేట, నెల్లూరు-తిరుపతి, గూడూరు- రాపూరు వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపుతున్నారు. బైకులు, ఆర్టీసీ బస్సులు ఏ వాహనాన్నీ వదలకుండా తనిఖీ చేస్తున్నారు. రూ. 50 వేలకు మించి నగదు పట్టుపడితే సరైన పత్రాలు చూపమంటున్నారు. లేదంటే సీజ్ చేస్తున్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం : డీఎం

రాపూరు(డక్కిలి), జనవరి 29: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, అంతేకాకుండా ఆకర్షణీయమైన బహుమతులను సొంతం చేసుకోవచ్చని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ కంట్రోల్ పాయింట్‌లో లక్కీ డ్రా తీశారు. ఈ డ్రాలో రాపూరుకు చెందిన ప్రయాణికుడు ఎస్‌కే జావీద్, వెంకటగిరికి చెందిన పీటర్, అఖిల్‌రెడ్డిలు విజేతలుగా నిలవడంతో బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఆయన అన్నారు.

పల్లెనిద్ర సమస్యలపై వినతి

ఇందుకూరుపేట, జనవరి 29 : పల్లెనిద్ర పాదయాత్రకు అపూర్వ స్పందన లభిస్తున్నదని కోవూరు నియోజవర్గ జనసేన పరిశీలకుడు గుడి హరికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నాలుగోరోజు సోమవారం మండలంలోని పాగావారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యాగర్ల సెంటర్ మీదుగా డేవిస్‌పేటకు చేరుకుని ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. తదుపరి ఇందుకూరుపేటకు చేరుకుని ఎమ్మార్వోను కలిసి మూడు రోజులుగా గుర్తించిన సమస్యలపై అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, మోహన్, షంషూర్, వెంకీ, జీ జనార్దన్, అశ్వక్, నాయబ్ పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుడికి హోమాలు, అర్చనలు

విడవలూరు, జనవరి 29: స్థానిక కామాక్షినగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో సోమవారం వైభవంగా హోమాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పొన్నలూరు బుజ్జిరెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, పొన్నలూరు పురందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదానం చేశారు.

అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం : దినేష్

ఇందుకూరుపేట, జనవరి 29 : అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తామని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాముడుపాలెంలో సోమవారం ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాముడుపాలెంలో స్థానిక వైసీపీ నాయకులు కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుంటే, ఎమ్మెల్యే ప్రసన్న పట్టించుకోవడం లేదని తెలిపారు. అనంతరం చాముండేశ్వరిదేవి అమ్మవారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్ యాదవ్, బండ్ల ఉదయ్‌కుమార్, బండ్ల మల్లికార్జున్, ఈదూరు చెన్నయ్య, సింధూరకృష్ణ, బొద్దు లూరు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో ఆసరా సంబరాలు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29 : బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణంలో సోమవారం ఆసరా సంబరాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పొదుపు మహిళలు తరలివచ్చారు. ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ బీద మస్తాన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొదుపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, చైర్‌పర్సన్ సుప్రజ, ఎంపీపీ శ్రీనివాసులు, ఏపీఎం లలిత, సీసీలు ఉమామహేశ్వరి, ఖాజా మస్తాన్ పాల్గొన్నారు.

'ఖేలో ఇండియా'లో 'అదానీ' విద్యార్థుల ప్రతిభ

ముత్తుకూరు, జనవరి 29 : కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్‌లో ప్రతిభ చాటారు. కర్నూల్ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకాలు సాధించారని అదాని వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్య నారాయణ సిరియాల తెలిపారు. సోమవారం అదాని వరల్డ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తైక్వాండో కోచ్ పావని, పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

రహదారి భద్రతపై అవగాహన అవసరం

రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదాని కృష్ణపట్నం పోర్టు సీవోవో రాజన్‌బాబు అన్నారు. సోమవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పోర్టులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రహదారిపై ప్రయాణం సాగించేటప్పుడు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులు, ఉద్యోగులతో భద్రతా చర్యలు పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. పోర్టులో ర్యాలీ నిర్వహించి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ డీజీఎం వెంకటేష్ భాస్కరన్, రామకృష్ణ, మనోహర్‌బాబు, గంగా సతీష్, వేణుగోపాల్‌రెడ్డి, పొన్నివలన్, కెప్టెన్ సాహూ, విజయ్ పాల్గొన్నారు.

'డీఎల్ఎన్ఆర్'లో పరీక్ష పేకి మంగళం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29: బుచ్చి డీఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో పరీక్ష పే కార్యక్రమాన్ని నిర్వహించకుండా మంగళం పాడేశారు. ఈ విషయం సోమవారం డిప్యూటీ డీఈవో ప్రసన్నలక్ష్మి తనిఖీలలో బయటపడింది. ఆమె ఈ కార్యక్రమం గురించి విద్యార్థులను అడగ్గా, నిర్వహించలేదని వారు తెలిపారు. దీంతో ఆమె ఇన్‌చార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో తనిఖీలు చేస్తుండగా, ఫోన్‌కాల్ రావడంతో అక్కడి నుంచి హడావిడిగా వెళ్లిపోయారు. నెల్లూరు నుంచి బుచ్చి వస్తూ ముందుగా రేబాల హైస్కూల్‌లో కూడా తనిఖీలు చేపట్టారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం : మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు, జనవరి 29 : మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం అని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ ఆవరణలో నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీవో ప్రత్యూష, తహసీల్దారు లావణ్య, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం శైలజ, నాయకులు శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, కావలిరెడ్డి రంగారెడ్డి, జడ్పీటీసీ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు నిర్మిస్తే జీవనం కోల్పోతాం

● కోడూరు మత్స్యకార నేతల నిరసన

తోటపల్లిగూడూరు, జనవరి 29: సముద్ర తీరాన భారీ ప్రాజెక్టు నిర్మాణానికి స్థానిక నేతలు కొందరు సర్వం సిద్ధం చేస్తున్నారని, దీంతో తాము జీవనాధారం కోల్పోతామని మత్స్యకార సొసైటీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కోడూరుపాలెంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ కోడూరు గ్రామంలో 8 మత్స్యకార గ్రామాలు ఉండగా ఎవరినీ సంప్రదించకుండా ప్రాజెక్టు నిర్మాణానికి మిషనరీ సిద్ధం చేస్తున్నారని, దీనివల్ల తాము జీవనం కోల్పోతామన్నారు. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులు తెలియదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తమ గ్రామాల సముద్ర తీరాన ఏపనులు చేయాలన్నా 8 గ్రామాల మత్స్యకారులను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పామంజి గోవిందు, మెంబర్లు పామంజి దొరబాబు, భక్తాని రామాంజనేయులు, అర్జున శీనయ్య, ఆవుల మునిరత్నం, మత్స్యకార నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

25 కుటుంబాలు టీడీపీలో చేరిక

పొదలకూరు, జనవరి 29 : మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ నాయకులంతా టీడీపీలో చేరుతుంటే మంత్రి కాకాణి మాత్రం వైసీపీ వాళ్లని వైసీపీలోనే చేర్చుకుంటున్నారన్నారు. అనంతరం పార్టీలో చేరిన 25 కుటుంబాల వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, అమ్మవారిపాలెం టీడీపీ నాయకులు గిరినాయుడు, మునిబాబు, సీతారామనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింగల్ నెంబర్లాటను కట్టడి చేయండి

నెల్లూరు(క్రైం), జనవరి 29: కుటుంబాలను నాశనం చేస్తున్న సింగల్ నెంబర్లాటను కట్టడి చేయాలని సీపీఎం నగర నాయకులు కాయం శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు సోమవారం నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డికి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డీఎస్పీ సింగల్ నెంబర్లాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జగనన్న ఇళ్ల అక్రమాలపై విచారణ జరిపించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వెంకటాచలం, జనవరి 29: నిడిగుంటపాళెం గ్రామంలో జగనన్న ఇళ్ల మంజూరులో జరిగిన అక్రమాలపై తక్షణమే విచారణ జరిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన లబ్ధిదారులు, పేదలతో కలిసి నిరసన చేపట్టి అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు నెల్లూరు కలెక్టరేటులో జరిగిన స్పందనలో లబ్ధిదారులకు న్యాయం చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో ఎస్సీల కోసం రూ.4.80 ఎకరాల్లో 197 ఇళ్ల స్థలాలు వేశారని, అలాగే బీసీల కోసం కూడా ఇళ్ల స్థలాలు వేశారన్నారు. అయితే రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇటీవల ఈ పట్టాలను కేవలం ఆరుగురికి మాత్రమే గ్రామసభలో ఇచ్చారన్నారు. మిగిలిన పట్టాలను స్థానిక వైసీపీ నేత ఇంట్లో పెట్టుకుని రూ.50 వేలకుపైగా నగదు ఇచ్చిన వారికి మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే తాము కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అసనాపురం శ్రీనివాసులు, నరేష్, నరేంద్ర తదితరులున్నారు.

కోవూరులో 'పల్లెకు పోదాం'

కోవూరు : స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సోమవారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ దాసరి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రబోలు రాజేష్, చిలుకా ప్రవీణ్, పరశురామ్, ఇండ్ల వెంకట రాఘవేంద్ర, పోలిశెట్టి వెంకటసుబ్బారావు, గాదిరాజు చక్రవర్తి, విన్నకోట బాలకృష్ణ పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నేడు త్యాగరాజ స్వామి ఆరాధన

నెల్లూరు(సాంస్కృతికం) : వేదాయపాలెం త్యాగరాజస్వామి మందిరంలో మంగళవారం ఆరాధనోత్సవం జరుగుతుందని త్యాగరాజ సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు త్యాగరాజ సంకీర్తన, 10 గంటలకు విద్వాంసులచే పంచరత్న కీర్తన, త్యాగరాజ కృతుల కచ్చేరీ, 11గంటలకు ఆరాధన, 1గంటకు అన్న ప్రసాద వితరణలు జరుగుతాయని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధిని విస్మరించిన సీఎం జగన్ : పొంగూరు

నెల్లూరు(వైద్యం), జనవరి 29 : రాష్ట్ర అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్ విస్మరించారని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ మండిపడ్డారు. సోమవారం నగరంలోని 7, 46వ డివిజన్‌లలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలను మరచి ప్యాలెస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. కేవలం నలుగురు ఇచ్చే సలహాలతో అరాచక పాలన చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ఒక్క రూపాయి పన్నులు పెంచలేదని, ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలపై తీవ్ర భారం పడుతుందని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా జగన్ చెత్త మీద కూడా పన్ను వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలే భూస్థాపితం చేస్తారన్నారు. ఆదివారం నగరంలో జరిగిన చంద్రబాబు పాల్గొన్న రా.. కదిలి రా సభ విజయవంత అయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ కరీముల్లా, విజేత, రంగమయూర్‌రెడ్డి, కోకు మహేందర్‌రెడ్డి, దశరథరామి రెడ్డి, శోభన్‌బాబు, లోకేష్, వెంకటేష్, మణిశేఖర్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నారాయణ

జీజీహెచ్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌పై దాడి

నెల్లూరు(వైద్యం), జనవరి 29 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం సెక్యూరిటీ సూపర్‌వైజర్‌పై దాడి జరిగింది. దీంతో సెక్యూరిటీ గార్డులు సెక్యూరిటీ గార్డుల యూనియన్ నేత మనోజ్‌తో కలసి జీజీహెచ్ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితుడు ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాధితుల కథనం మేరకు... జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో ఓ స్టాఫ్‌నర్సు భర్త మోటారు బైక్ పార్క్ చేస్తుండగా అంబులెన్స్‌లు వస్తాయని, అడ్డం లేకుండా పక్కన పార్క్ చేసుకోవాలని సెక్యూరిటీ సూపర్‌వైజర్ చెప్పారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై సెక్యూరిటీ గార్డులు జీజీహెచ్ ఎదుట ఆందోళనకు దిగారు.



ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

టీడీపీతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి : అజీజ్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జనవరి 29 : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్య మని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ తెలిపారు. నగరంలోని 54 డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నెల్లూరు నగరం అభివృద్ధి చెందాలంటే నారాయణ ఎమ్మెల్యే కావాలన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజానాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, జహీర్, సుధాకర్, రమాదేవి పాల్గొన్నారు.

మహిళా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పునఃప్రారంభిస్తాం

నెల్లూరు(వైద్యం) : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే లాల్ దర్గా కాలువ నిర్మాణం చేపడతామని, మహిళా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పునఃప్రారంభిస్తామని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ తెలిపారు. సోమవారం 42వ డివిజన్‌లోని ఖుద్దూస్ నగర్‌లో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జాఫర్ షరీప్, మొయినుద్దీన్, హయాత్‌బాబా, ఖలీల్, కాలేషా, ఖాలిద్, గాయాజ్, మున్నా, గౌస్‌బాషా పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఐ ఆందోళన

నెల్లూరు(సిటీ), జనవరి 29 : నెల్లూరు నగరంలో ప్రజలను దోమలు పట్టిపీడిస్తున్నాయని, కనీసం నివారణ చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ పార్టీ నేతలు అరిగెల నాగేంద్రసాయి, వీ.రామరాజు మాట్లాడుతూ నగరంలో ప్రజలు దోమల దాడులకు రోగాల పాలవుతున్నారని చెప్పారు. అనంతరం కమిషనర్ వికాస్‌మర్మత్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లీలామోహన్, నాగేంద్ర, సతీష్, స్టాలిన్, ముక్తియార్‌లు పాల్గొన్నారు. కాగా ముత్తుకూరు గేట్ సర్కిల్ వద్ద ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని తెలుగు యువత నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

పొదుపు మహిళల ఆర్థిక తోడ్పాటుకే ఆసరా

నెల్లూరు(హరనాథపురం), జనవరి 29 : పొదుపు మహిళల ఆర్థిక తోడ్పాటుకే ఆసరా అని ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మెప్మా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 4వ విడత ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్లు పిండి శాంతి, దాసరి అమృత రాజేష్, నాయకులు స్వర్ణ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ : నీటిపారుదల శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం 2024 డైరీని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నమెంటు రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, నాయకులు అంకయ్య, వైసీపీ నాయకులు మద్దాల శ్రీధర్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి విశేష కుంకుమార్చన

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 29 : దేవదాయ శాఖ ఆదేశాల మేరకు హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా నగరంలోని పడారుపల్లి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవికి సోమవారం రాత్రి విశేష కుంకుమార్చన జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేద పండితులు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని చైర్మన్ రత్నంజయరామ్, ఏసీ ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



16 రోజుల పండుగ : వేదాయపాలెం కృష్ణమందిరంలో గోదాదేవి సమేత రంగనాథస్వామికి 14వ తేది భోగి పండుగ రోజున కల్యాణం జరగగా సోమవారం రాత్రి 16 రోజులు పండుగ కనుల పండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవారికి శాస్త్రోక్తంగా ఏకాంత సేవా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సౌత్‌మోపూరులో ఎన్ఎస్ఎస్ వైద్యశిబిరం

నెల్లూరురూరల్, జనవరి 29 : మండలంలోని సౌత్‌మోపూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో ప్రజలకు పీహెచ్‌సీ వైద్య బృందంతో పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని నెల్లూరుకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొండయ్య, గ్రామ సర్పంచు పోలయ్య, ఎన్ఎస్ఎస్ పీవో విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరురూరల్, జనవరి 29 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పాత వెల్లంటికి చెందిన జువ్వల శీనయ్య (40) ఆదివారం నెల్లూరు నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా జొన్నవాడ రహదారిలో దొడ్ల డెయిరీ వద్ద కారు ఢీకొని జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో గాయపడ్డ మరికొందరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు పరామర్శించారు.

బుచ్చిరెడ్డిపాళెం : నెల్లూరు రూరల్ మండల పరిధిలోని దొడ్ల డెయిరీ ప్రాంతంలో ఆటోని ఢీకొట్టి ఓ ప్రయాణికుడి మృతికి కారణమైన కారు సోమవారం తెల్లవారు జామున జొన్నవాడ గిరిజనకాలనీలో ప్రత్యక్షమైవుంది. దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కుమార్

నెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శిగా ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలోని టెక్నికల్ అధికారి కే.కుమార్‌ను ఎన్నుకున్నారు. ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం సోమవారం నెల్లూరులో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం.రవిప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు నాగప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పీ.మునిరెడ్డిలు హాజరయ్యారు. వీరి సమక్షంలో కె.కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే గయాజ్, జిల్లా కార్యనిర్వాహక ప్రెసిడెంట్ ఈవీఆర్‌కే రెడ్డి, జాయింట్ సెక్రటరీ యస్‌వీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కుమార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర నేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నెల్లూరు(సిటీ), జనవరి 29 : నెల్లూరు నగర పాలక సంస్థ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ఎన్ఎంసీ కార్యాలయంలోని మేయర్ చాంబరులో మేయర్ పీ.స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్‌లు స్టడీ మెటీరియల్ అందజేశారు. వీటి సహాయంతో విద్యార్థులు రానున్న పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు.


కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించిన కలెక్టర్



కమాండ్ కంట్రోల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 29 : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ కార్యాలయ భవనాన్ని సోమవారం కలెక్టర్ ఎం హరినారాయణన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలిసి పరిశీలించారు. నగరంలోని వివిధ కూడళ్లు, ప్రధాన రహదారులను కలుపుతూ ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. పారిశుధ్య పరిశీలనార్థం ఏర్పాటు చేసిన ఈ విధానం అమలు తీరును కమిషనర్ ఆయనకు వివరించారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ పురోగతిపై ఆయన సమీక్షించారు. కాగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ కార్పొరేషన్‌లో కమిషనర్‌ను కలిశారు.

విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి

నెల్లూరు(విద్య), జనవరి 29 : విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ఉపాధ్యాయులు శిక్షణ పొందాలని సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్.ఉషారాణి తెలిపారు. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిని ఎంచుకునే విషయంలో సందేహాలపై సరైన మార్గదర్శకం చేసేందుకే ఉపాధ్యాయులకు విద్యాశాఖ, సమగ్రశిక్ష ఈ శిక్షణ ఇస్తుందన్నారు. ఏఎంవో సుధీర్‌బాబు, మెల్‌బోర్న్ యూనివర్శిటీ గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సీఈవో రావ్వెల్ ష్రాఫ్, సీమాట్ ప్రతినిధి డాక్టర్ కె.శారద, సమన్వయకర్త అనూష కామిరెడ్డి, రీసోర్స్ పర్సన్ ఎస్ వీ.మంజునాథ్, కె.విజయచంద్ర పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

నెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పరిధిలోని నవబాలదుర్గాదేవి దేవాలయం సమీపంలో కొందరు వ్యక్తులు ఇరిగేషన్ కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. దీనిపై పలువురు స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ ఆక్రమణలను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు వెంటనే తహసీల్దారుకు, పోలీసులకు ఫిర్యాదు చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. కాగా చెరువులు, కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఎస్ఈ పీ కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇరిగేషన్ ఆస్తులను కొందరు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆక్రమణదారులు, వాటిని విక్రయిస్తున్న దళారులపై కేసులు పెడతామని హెచ్చరించారు.

చిరంజీవి అభిమానుల సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషన్ అవార్డును ప్రకటించడంతో చిరంజీవి యువత, కాపురాక్స్ యంగ్ ఇండి యన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభిమానులు సోమవారం నర్తకీ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. బాణసంచా కలుస్తూ, కేక్‌లు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకులు రవికుమార్, కృష్ణారెడ్డి, పీ.చంద్రశేఖర్ రెడ్డి, జనసేన నాయకులు గునుకుల కిషోర్, ఈగి సురేష్, మేకల ప్రసాద్, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ప్రత్యేక వాహన సదుపాయం

నెల్లూరు (వైద్యం) జనవరి 29 : చెన్నైలోని మియాట్ హాస్పిటల్‌కు రోగులు తరలించేందుకు ప్రత్యేక వాహన సదుపాయంను కల్పించినట్లు చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ చైర్మన్ రమేష్ వెల్లడించారు. సోమరవారం ఆయన మాట్లాడుతూ రోగుల కోసం ఓ టెంపో ప్రతి మంగళ గురువారాల్లో చెన్నైకు వెళుతుందని, రూ.400 మాత్రమే చెల్లిస్తే చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మియాట్ ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజు, ఇన్ఫర్మేషన్ సెంటర్ మేనేజర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎ.రంగంపేటలో డబుల్ ఎంట్రీలు

పనిచేయని ఈసీ హెచ్చరికలు

ఓటర్ల జాబితా తప్పుల తడక




160,857 నెంబర్లతో రెండుసార్లు ఓటరుగా నమోదైన మమత







440,553నెంబర్లతో రెండుసార్లు ఓటరుగా నమోదైన రాజవర్ధన్



శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే అత్తగారికి రెండు ఓట్లు

కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్ని హెచ్చరికలు చేసినా, ఎన్ని నోటీసులు జారీ చేసినా తాజా ఓటర్ల జాబితా మాత్రం సక్రమంగా తయారు కాలేదు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్ల జాబితాలు తప్పుల తడకలుగానే కనిపిస్తున్నాయి. రోజులు గడిచేకొద్దీ క్షేత్రస్థాయి పరిశీలనలో ఓటర్ల జాబితా అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి.

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి అత్తగారి (భార్య తల్లి) పేరిట రెండు ఓట్లు నమోదయ్యాయి. పట్టణంలోని ఏఎం పుత్తూరు పోలింగ్ కేంద్రం నంబరు 104 పరిధిలో ఇంటి నంబరు 15-507 చిరునామాపై సామాను అనసూయమ్మ (70)కు ఓటరు సీరియల్ నంబరు 840, ఎపిక్ నంబరు యూసీజీ 0032995లతో ఓటరుగా జాబితాలో నమోదైంది. అయితే అదే పోలింగ్ కేంద్రం పరిధిలోనే ఇంటి నంబరు 15-371 చిరునామాపై ఓటరు సీరియల్ నంబరు 459, ఎపిక్ నంబరు ఎంఎన్‌వీ 2684942లతో మరో ఓటు కూడా నమోదై వుంది. ఇందులో ఆమె వయసు 52గా పేర్కొని వుంది.రెండు వేర్వేరు ఎపిక్ కార్డులు జారీ కాగా మొదటి కార్డు ఒరిజినల్‌గా భావించాల్సి వుంది. ఎందుకంటే మొదటి ఎపిక్ కార్డులో పేర్కొన్న చిరునామా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఇంటిది. అందులోనే ఆయన అత్తగారైన అనసూయమ్మ కూడా నివాసముంటున్నారు. రెండవ ఎపిక్ కార్డులో నమోదైన చిరునామాలో వాస్తవంగా పెత్తం పార్వతమ్మ, గంగరామిరెడ్డి దంపతులు నివాసముంటున్నారు. అది వారి సొంతిల్లు. అదే చిరునామాతో ఆ దంపతులిద్దరూ ఓటర్లుగా నమోదై వున్నారు. దీంతో ఎమ్మెల్యే అత్తగారి పేరిట నమోదైన రెండవ ఓటు నకిలీదిగా భావించాల్సి వస్తోంది.




ఒకే బూత్‌లో రెండుసార్లు ఓటరుగా నమోదైన శివ



అనసూయమ్మ ఓటరుగా నమోదైన ఇంటిలో నివసిస్తున్న పార్వతి,గంగారామిరెడ్డి దంపతులు



పార్వతి ఓటరు కార్డు



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఇంటి చిరునామాతో ఓటరుగా నమోదైన అనసూయమ్మ- మరో ఇంటి చిరునామాతో కూడా ఓటరుగా అనసూయమ్మ

ఎ. రంగంపేటలో పలు డబుల్ ఎంట్రీలు

చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అవకతవకల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. తాజాగా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో పోలింగ్ కేంద్రం నంబరు 111 పరిధిలో పలు డబుల్ ఎంట్రీలు వెలుగులోకి వచ్చాయి. 2-30 నంబరు ఇంటిలో నివాసముంటున్న అరిగల సుధాకర్ కుమారుడు అరిగల శివ (29) పేరు ఓటరు సీరియల్ నంబరు 316, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3248986లతో జాబితాలో నమోదై వుంది. అయితే అదే పోలింగ్ కేంద్రం పరిధిలో అదే చిరునామాతో ఓటరు సీరియల్ నంబరు 317, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 2024826లతో అతడి పేరు జాబితాలో రెండవసారి నమోదైంది. రెండు చోట్లా ఫొటో ఒకటే అప్‌లోడ్ అయింది. అలాగే పోలింగ్ కేంద్రం 111 పరిధిలోనే 1-66-1 ఇంటి నంబరు చిరునామాతో ఎ.సుబ్రమణ్యం కుమార్తె ఎ.మమత (19) ఓటరు సీరియల్ నంబరు 160, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3232675లతో ఓటరుగా నమోదయ్యారు. అదే జాబితాలో మమత పేరు అదే చిరునామాతో ఓటరు సీరియల్ నంబరు 857, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3346913లతో మరో చోట కూడా నమోదై వుంది. ఆ పోలింగ్ కేంద్రంలోనే 2-88 ఇంటి నంబరు చిరునామాతో చిత్తూరు ధనరాజ కుమారుడు చిత్తూరు రాజవర్ధన్ (19) పేరు ఓటరు సీరియల్ నంబరు 440, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3208618లతో ఓటరు జాబితాలో నమోదైంది. అదే పోలింగ్ స్టేషన్, అదే చిరునామాతో ఇతడి పేరు ఓటరు సీరియల్ నంబరు 543, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3254455లతో మళ్లీ జాబితాలో నమోదైంది. ఇవన్నీ కూడా గతేడాది అక్టోబరు 27 - ఈనెల 22 తేదీల మధ్యలో నమోదైనవే కావడం గమనార్హం. ఇదివరకే తిరుపతి రూరల్ మండల పరిధిలో ఈ తరహా డబుల్ ఎంట్రీలను పెద్దసంఖ్యలో గుర్తించిన నేపథ్యంలో తాజాగా చంద్రగిరి మండలంలోనూ బయటపడుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలు చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారు చేసిన అధికారులు, ఉద్యోగులపై ప్రభావం చూపలేదనే భావించాల్సి వస్తోంది.

హుండీ, వడ్డీ ఆదాయాలే ప్రధాన వనరులు

రూ.5,141.74 కోట్ల బడ్జెట్‌కు టీటీడీ బోర్డు ఆమోదం

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల పెంపు



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈసారి బడ్జెట్‌లోనూ శ్రీవారి హుండీ, వడ్డీల ద్వారానే ఆదాయాలు భారీగా సమకూరుతాయని అంచనా వేసింది.వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.5,141.74 కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు టీటీడీ ధర్మకర్తల మండలి సోమవారం ఆమోదం తెలిపింది. గడిచిన ఏడాది హుండీ ద్వారా రూ.1,591 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,611 కోట్ల కానుకలు లభించాయి. ఈ క్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.1,611 కోట్ల హుండీ ఆదాయం లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. రూ.900 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లలోపు ఉండే హుండీ ఆదాయ అంచనాలు కొవిడ్ అనంతరం భారీగా పెరిగాయి. 2022-23 బడ్జెట్‌లో హుండీ ద్వారా రూ.వెయ్యి కోట్లు లభిస్తుందని అంచనా వేయగా రూ.1,613 కోట్లు లభించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో హుండీ ఆదాయం టీటీడీకి ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

మరోవైపు వడ్డీల ద్వారా రూ.990 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,068.51 కోట్లు లభించింది. ఈ క్రమంలో నూతన బడ్జెట్‌లో రూ.1,167 కోట్ల ఆదాయం వడ్డీల ద్వారా లభిస్తుందని టీటీడీ అంచనా వేస్తోంది. మరోవైపు ప్రసాదాల ద్వారా రూ.500 కోట్లు లభిస్తుందని భావించగా రూ.50 కోట్లు పెరిగింది. ఈ క్రమంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. తలనీలాల విక్రయాల ద్వారా గత బడ్జెట్‌లో రూ.126.50 కోట్లు వస్తుందని టీటీడీ అంచనా వేయగా రూ.226.50 కోట్ల ఆదాయం సమకూరింది. అయినప్పటికీ నూతన బడ్జెట్‌లో రూ.151.50 కోట్లు మాత్రమే లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. మరోవైపు ఇంజనీరింగ్ పనులకు టీటీడీ ఈసారి రూ.190 కోట్లు కేటాయించింది. సాధారణంగా రూ.వంద కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు ఇంజనీరింగ్ పనులకు నిధులను కేటాయిస్తారు. ఈ క్రమంలోనే టీటీడీ గత బడ్జెట్‌లోనూ రూ.120 కోట్లు కేటాయించగా రూ.150 కోట్లు వినియోగించారు.తాజా బడ్జెట్‌లో ఇంజనీరింగ్ పనులకు ఏకంగా రూ.190 కోట్లు ఖర్చుల్లో జతచేసింది.తిరుపతిలో నిర్మించిన శ్రీనివాససేతు ఫ్లైఓవర్‌కు రూ.53 కోట్లు కేటాయించారు. కాగా టీటీడీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచామని ఛైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన బోర్డు సమావేశ నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. టీటీడీ పాలనా వ్యవహారాలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఐదేళ్ల కాలపరిమితికి గాను ఒరాకిల్ ఫ్యూజన్ క్లౌడ్ ఐఆర్పీ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపామన్నారు.



అనంతపురం సభకు 'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి ,రోజా తదితరులు

తిరుపతి ఎంపీ సీటుకు కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం

టికెట్లు రానివారిని ఇతర పదవులతో సంతృప్తిపరుస్తాం - మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. అనంతపురంలో వచ్చే నెల మొదటివారంలో జరగనున్న వైసీపీ 'సిద్ధం' సభ ఏర్పాట్లపై చర్చించేందుకు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సమావేశం జరిగింది.జన సమీకరణ ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్యేలతో, నాయకులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను అవినీతిపరుడో కాదో ప్రజలకు తెలుసునని, ఆదిమూలంపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తిరుపతి ఎంపీగా ఆదిమూలం స్థానంలో కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందన్నారు.టికెట్లు రానివారిని ఇతర పదవులతో సంతృప్తిపరిచేందుకు పార్టీ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రాయలసీమ జిల్లాల్లో అన్ని సీట్లనూ వైసీపీ గెలుచుకుంటుందన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఒంగోలుకు సిద్ధమే : మంత్రి రోజా

మంత్రి రోజా మాట్లాడుతూ 'నగరి నియోజకవర్గంలో పనిచేసుకుంటున్న నేను ఒంగోలుకు పోవాల్సిన అవసరం ఏముందో అర్థం కావడంలేదు. ఒకవేళ పార్టీ ఆదేశిస్తే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా నేను సిద్ధమే' అన్నారు. తాను నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నానని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు ఎవరి దగ్గరైనా ఒక్క రూపాయి తీసుకునివుంటే నిరూపించాలన్నారు. వైసీపీ పుణ్యంతో కౌన్సిలర్ అయిన మహిళ ఎవరో చెప్పిన మాటలకు లొంగి తనపై బురద జల్లారని, అలాంటివాళ్లకు భగవంతుడే సమాధానం చెబుతాడన్నారు.టీడీపీ, జనసేన పార్టీలకు నాయకులు లేక అభ్యర్థుల జాబితా విడుదల చేయలేకపోతున్నారన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ ఏపీలో రాజకీయాలు చేసే నాన్‌లోకల్ లీడర్లు ఎక్కువైపోయారంటూ ఎద్దేవా చేశారు.చంద్రబాబు, పవన్ మధ్యలో నాలుగో కృష్ణుడిలాగా షర్మిల ప్రవేశించిందన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్ కుటుంబాన్ని ముక్కలు చేస్తోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు కరెక్టు కాదన్నారు. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయని చెప్పడానికి ఆదిమూలం వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు.

● పలువురు నేతల డుమ్మా

రాయలసీమ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ కోఆర్డినేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి జయరాం,ఎంపీ గోరంట్ల మాధవ్, పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం, నవాజ్ భాషా, తిప్పేస్వామి సమావేశానికి రాలేదు.అదేవిధంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, రాజంపేట, కదిరి ఎమ్మెల్యేలు మేడా మల్లిఖార్జున్ రెడ్డి, సిద్దా రెడ్డి కూడా హాజరు కాలేదు.కొందరు ఎమ్మెల్యేలు వ్యక్తిగత కారణాలతో రాలేకపోయారని పెద్దిరెడ్డి చెప్పుకొచ్చారు.తిరుపతిలో సమావేశం జరిగినప్పటికీ స్థానిక నేతలు కన్పించకపోవడాన్ని పలువురు చర్చించుకోవడం కనిపించింది.ఎంపీ గురుమూర్తి మినహా తక్కినవారు సమావేశంలో కనిపించలేదు.

విద్యుత్తు కార్మికులపై గంజాయి మూక దాడి

● రోడ్డుకడ్డంగా ఉన్న వాహనాలను తీయమన్నందుకు రెచ్చిపోయిన వైనం
● ఇద్దరి పరిస్థితి విషమం.. నలుగురికి తీవ్రగాయాలు



రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న రవి, దామోదరం

తిరుపతి సిటీ, జనవరి 29 : రోడ్డుకడ్డంగా నిలిపి ఉన్న వాహనాన్ని పక్కకు తీయమని అడిగినందుకు గంజాయి మత్తులో ఉన్న కొందరు ఆకతాయిలు విద్యుత్తు కార్మికులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన రేణిగుంట పట్టణ సమీపంలోని జ్యోతినగర్‌లో సోమవారం చోటుచేసుకుంది.220 కేవీ సబ్‌స్టేషన్‌లో పనిచేసే కొందరు రేణిగుంట నుంచి చంద్రగిరి వరకు జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్తు తీగలను తనిఖీ చేసి, విద్యుత్తు శాఖ వాహనంలో సాయంత్రం 4 గంటలకు సబ్‌స్టేషన్‌కు తిరిగివస్తున్నారు. జ్యోతినగర్ వద్దకు వచ్చేసరికి కొందరు ఆకతాయిలు రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలను ఆపి ఉండటంతో పక్కకు తీసి దారివ్వాలని కోరారు. మమ్మల్నే వాహనాలు తీయమంటారా అంటూ పదిమంది ఆకతాయిలు ఒక్కసారిగా విద్యుత్తు కార్మికులపై విరుచుకుపడ్డారు. దొరికిన ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. అటుగా వెళుతున్న కొందరు వాహనదారులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా వారిపైనా దాడికి ప్రయత్నించారు. దాదాపు గంటకు పైగా వారు విద్యుత్తు కార్మికులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దామోదరం, రవి, శంకర్, ఉదయ్ కుమార్ తీవ్రంగా, శ్రీనివాసులు, కన్నయ్య, రమణ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో రుయాస్పత్రికి తరలించారు. రవి, దామోదరం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన వారందరూ గంజాయి మత్తులో ఉన్నారని, అందరూ జ్యోతినగర్, గణేష్‌నగర్‌కు చెందిన యువకులేనని బాధితులు చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విధి నిర్వహణలో ఉన్న విద్యుత్తు కార్మికులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ఎస్‌ఆర్వోలో సర్వర్ డౌన్

తిరుపతిలో ఆగిన రిజిస్ట్రేషన్లు

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్‌ఆర్వో)లో సోమవారం సర్వర్ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సరిచేయాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో ఆస్తుల క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్స్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంపై అవగాహన లేకపోవడంతోనే రిజిస్ట్రేషన్స్ ప్రక్రియకు బ్రేకులు పడుతున్నాయని చెబుతున్నారు. సోమవారం కేవలం రెండు రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయంటే పరిస్థితి ఎలావుందో అర్థమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అమ్మకందారులు రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో కొనుగోలుదారులతో గొడవలకు దిగుతున్నారు. రవాణా, వసతి ఖర్చులు చెల్లించాలని డిమాండు చేస్తున్నారు. సెంటిమెంటుగా మంచి రోజు అనుకుని వచ్చేవాళ్లకు నిరాశే మిగులుతోంది. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించినప్పటికీ సేవలలో లోపం కారణంగా కొనుగోలుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ తీరు రెడ్ల వర్గానికే కళంకం

టీడీపీ నేత సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జనవరి 29.వైసీపీ తీరు రెడ్ల సామాజిక వర్గానికే తీవ్ర కళంకంగా మారిందని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...వైసీపీలో పైన జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి,పెద్దిరెడ్డి దగ్గర నుంచి కింద మధుసూదన రెడ్డి వరకు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే తనకు రెడ్డిగా ఎందుకు పుట్టాననే ఆవేదన కలుగుతోందన్నారు.రు.చిత్తూరు టికెట్‌ను ఏకంగా ఎర్రచందనం స్మగ్లర్ విజయానంద రెడ్డికి ఇవ్వడం దారుణమన్నారు.శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి భూ అరాచకాలకు అంతేలేకుండా పోతోందన్నారు. రేణిగుంటలో ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేసి వెంచర్లు వేసి అమ్ముకుంటున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి,కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వండి

డక్కిలి, జనవరి 29: మండలంలోని మోపూరు సర్వే నెంబరు 1లో గిరిజనులు, సంచారజాతులు సాగు చేసుకొంటున్న భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య మాట్లాడుతూ మోపూరు రోడ్డు, సూరాయపాళెం, మోపూరు వెల్లంపల్లి ప్రాంతాల్లో గిరిజనులు, సంచారజాతులకు చెందిన కుటుంబాలు గత కొన్నేళ్ల నుంచి అటవీ భూములను సాగు చేసుకొంటున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మిగులు భూములను పంచిపెట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. త్వరలో సర్వే నిర్వహించి అర్హులను గుర్తించి న్యాయం చేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు. చిరంజీవి, చంగయ్య, రఫీ, శ్రీనివాసులు, చెంచుకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

లారీ చక్రాల కింద నలిగి మహిళ మృతి



నాగమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగబాబు

కోట, జనవరి 29: కోట మండలం సిద్ధవరం పెట్రోల్ బంకు వద్ద జరిగిన ప్రమాదంలో లారీ చక్రాల కింద ఇరుక్కొని ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... కోట మండలం వెంకన్నపాళెంకు చెందిన గెంజి శంకరయ్య, నాగమ్మ(48) దంపతులు చిల్లకూరు మండలం కొమరావారిపాళెంలోని బంధువుల ఇంటికెళ్లారు. మోటారు బైక్‌లో తిరిగి స్వగ్రామమైన వెంకన్నపాళానికి వస్తుండగా కోట నుంచి బల్లవోలు వైపు వెళ్తున్న సిలికా తరలించే లారీ ఢీకొంది. బైక్ లారీ వెనుకచక్రాల కింద ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో లారీ చక్రాలు నాగమ్మ తలపైకి ఎక్కడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను చికిత్స నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ నాగబాబు సంఘటనాస్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. నాగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీటిగుంటలో పడి కూలీ మృతి

దొరవారిసత్రం, జనవరి 29: నీటిగుంటలో పడి కూలీ మృతి చెందిన ఘటన దొరవారిసత్రం మండలం ఉచ్చూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. మండలంలోని మంగళంపాడు గ్రామానికి చెందిన వేలింబేటి హరినాథ్(47) కూలి పనుల నిమిత్తం మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చాడు. ఆదివారం సాయంత్రం ఉచ్చూరులోని గుడి గుంట నీటిలో శవం తేలాడుతుండటంతో స్థానికులు గుర్తించారు. సోమవారం ఉదయం పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి



రోడ్డు నిబంధనలపై డ్రైవర్లుకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సునీల్

చిల్లకూరు, జనవరి 29: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం సాగించవచ్చునని ఎంవీఐ సునీల్ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసి డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న తప్పుల వల్లే పెద్ద ప్రమాదాలు జరుగుతాయన్నారు. డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో రహీం, వైద్యులు, రవాణాశాఖ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



నియామక పత్రాలను అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్

చిల్లకూరు, జనవరి 29: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గూడూరులో పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా భాస్కర్‌రావు, శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసాచారిని నియమించారు. కార్యక్రమంలో వేమయ్య, భాస్కర్‌రెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందలు



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేస్తున్న ఎంపీడీవో భవానీ

కోట, జనవరి 29: నియోజకవర్గ స్థాయి ఆడుదాం.. ఆంధ్రా.. క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను సోమవారం ఎంపీడీవో భవానీ అభినందించారు. కోట మండలానికి చెందిన ఆరు జట్లు ఆడుదాం.. ఆంధ్రా.. నియోజకస్థాయి క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. క్రీడాకారులను ఎంపీడీవో భవానీ, డీఎల్‌డీవో వాణి, డీఎల్‌టీవో వెంకటరమణలు షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

వెంకటగిరి టౌన్: నియోజకవర్గ స్థాయి ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీల విజేతలకు బహుమతులు, నగదు చెక్కులను వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అందజేశారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, చిట్టేటి హరికృష్ణ, డిల్లీబాబు, శాతరాశి బాలయ్య, నక్కా వెంకటేశ్వరరావు, ఏడీఏ నాగర్జున సాగర్, ధనియాల రాధ, నారాయణ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచుల నిరసన దీక్ష

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29: పంచాయతీల నిధులను బదలాయించుకుంటూ మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని సర్పంచులు మంగళవారం నిరసన దీక్ష చేస్తున్నట్లు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243 జి 11షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాల్లోని నిధులు, విధులు, అధికారాలను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఛైర్మన్లకు బదలాయించి, పంచాయతీలను బలోపేతం చేయాలని కోరారు. సర్పంచుల 16 డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌యాదవ్, రవి పాల్గొన్నారు.

జూకు కొత్త జంతువులు రాక

తిరుపతి అర్బన్, జనవరి 29: తిరుపతి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు సోమవారం కొత్త జంతువులు వచ్చాయి. ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పురం కానన్ పెండారి జులాజికల్ గార్డెన్ నుంచి ఒక జత నక్కలు, రెండు జతల థామిన్ జింకలు, మూడు జతల అడవి జింకలను తీసుకువచ్చినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయని, వాటిని డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు.

నివాళి

వెంకటగిరి, జనవరి 29: వెంకటగిరి పట్టణం తోలిమిట్ట ప్రాంతంలో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న రమాకాంత్ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన చిత్రపటానికి పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఆయన కర్మక్రియల నిర్వహణకు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.10వేలు, జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గంగోటి నాగేశ్వరావు, పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కవచా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు గుండు మనోజ్, మార్పు సంస్థ నిర్వాహకులు చిగురుపాటి పవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్, టిడ్కో గృహాలతో

మరో వెంకటగిరి నిర్మాణం

- 136 ఎకరాల్లో నగర వనం
- నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



లబ్ధిదారుకు తాళం అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 29: జగనన్న లే అవుట్, టిడ్కో గృహాలతో వెంకటగిరి కొత్త పట్టణంగా రూపు రేఖలు సంతరించుకుంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. వెంకటగిరిలోని తిరుపతి రోడ్డులో నిర్మించిన టిడ్కో ఇళ్లను సోమవారం ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ టిడ్కో గృహాల ద్వారా పైసా ఖర్చు లేకుండా సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందించామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాంకుమార్ రెడ్డిని గెలిపించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 1008 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. త్వరలో జగనన్న లేఅవుట్ ఎదురుగా 136 ఎకరాలతో నగర వనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి, రాజ్యలక్ష్మి కృషితో వెంకటగిరి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. సర్వజ్ఞ యాచేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చారన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైసీపీ పట్టణ కన్వీనర్ డిల్లీబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి హరకృష్ణ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రచార విభాగం అధ్యక్షుడు నెమ్మళ్లపూడి సురేష్‌రెడ్డి, ఉమామహేశ్వరి, ధనియాల రాధ, సుకన్య, మల్లీశ్వరి, నారాయణ, జానకీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జగదీష్

వెంకటగిరి, జనవరి 29: తిరుపతిలో బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ గుడారి జగదీష్ జీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు నివాసంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, వెనెముక, కీళ్లు, మోకాళ్ల నొప్పులకు సంబంధించిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 55కి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. వారందరికీ ద్వారకా తిరుమలలోని దేవస్థాన ట్రస్టు ఆధ్వర్యంలోని విరుడ్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫిబ్రవరి 11వ తేదీ వెంకటగిరిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. రోగులు 6303672977 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ట్రస్టు నిర్వాహకులు కోరారు.

వైసీపీ నేతలకు పరామర్శ

డక్కిలి, జనవరి 29: వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడిన దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యులు కోళ్ల శ్రీనివాసులు, వైసీపీ నేత బాలకృష్ణను సోమవారం ఆయన పరామర్శించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అండగా నిలుస్తానని రాంకుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైసీపీ నాయకులు అలిమిలి సురేష్ రెడ్డి, ఆల్తూరుపాడు సొసైటీ అధ్యక్షుడు దశరధరామిరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి, ఆదిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శికి నివాళి



మనోహర నాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, జనవరి 29: తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పాచిగుంట మనోహర నాయుడికి పెళ్లకూరు మండల టీడీపీ నేతలు నివాళులర్పించారు. చిత్తూరు జిల్లా పాచర్లపల్లి గ్రామానికి చెందిన మనోహర నాయుడు ఆదివారం మృతి చెందారు. సోమవారం పెళ్లకూరుకు చెందిన టీడీపీ నేత రావూరు రాధానాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు కనపర్తి గోపీనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌నాయుడు తదితరులు పాచర్లపల్లికి చేరుకుని మనోహర నాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు బీసీ సదస్సు

డక్కిలి, జనవరి 29: డక్కిలిలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ సదస్సు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటీశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఆస్పత్రి సలహాకమిటీ మాజీ ఛైర్మన్ చెలికం భాస్కరరెడ్డి తెలిపారు. మండలంలోని బీసీలందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం

గూడూరు, జనవరి 29: స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో సోమవారం ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో ఐటీఐ ప్రభాకర్, శ్రీనివాస కల్యాణ్ దాతృత్వంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, కోట శ్రీనివాసులు, పురంధర్‌రాజు, ప్రభాకర్, రాము, కుమార్ నాయుడు, శ్రీహరి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, సతీష్, కల్యాణి పాల్గొన్నారు.

పంచాంగాల అందజేత



పంచాంగ పుస్తకాలను అందజేస్తున్న అనంతాచార్యులు

కోట, జనవరి 29: కోట పట్టణంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారామ ధార్మికసేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు, పురోహితులకు సోమవారం పంచాంగాలను అందజేశారు. ఉపాధ్యాయ దంపతులు సూరపురాజు నాగరాజు, వెంకట కామాక్షి దంపతులు ఈ పంచాంగాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, ప్రసాద్‌బాబు, శేషస్వామి, నాగరాజు, సాయిబాబా, చలపతి, చంద్రమౌళి, శేషాద్రి, కృష్ణప్రసాద్, మహర్షి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నెలవలకు సన్మానం



నెలవలను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, జనవరి 29: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను దొరవారిసత్రం మండలానికి చెందిన పార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, పరంధామయ్య, నెలవల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ - హాజరైన పలు పరిశ్రమల ప్రతినిధులు

విద్య, పరిశ్రమల మధ్య అంతరం తగ్గించాలి

ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, జనవరి 29: పరస్పర ప్రయోజనం, సామాజిక బాధ్యత కోసం విద్య, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ కోరారు. తిరుపతి ఐఐటీ కెమికల్ ఇంజనీరింగ విభాగం పరిశోధన, విద్యా కార్య కలాపాల ప్రదర్శన, వివిధ పరిశ్రమలతో సహకారం పెంపొందించడం కోసం 'పరిశ్రమ - అకాడమీ ఇంటరాక్షన్ ఈవెంట్‌ను సోమవారం నిర్వహించింది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు పలు పరిశ్రమల నుంచి నిపుణులు హాజరయ్యారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాధిపతి ప్రొఫెసర్ టి.సునీల్ కుమార్ విజన్ మిషన్, ఐఐటీలో ఉన్న సౌకర్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, సాధించిన విజయాలను సంక్షిప్తంగా పరిచయం చేశారు. ఈ సదస్సు దీర్ఘకాలిక భాగస్వామ్యాలు, జాయింట్ వెంచర్లకు మార్గం సుగమం చేస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో ఎల్ అండ్‌టీ కమ్‌సోల్, యురేనియం కార్పొరేషన్, అమరరాజ గ్రూఫ్, భైకాన్, అప్లైడ్ మెటీరియల్స్ మ్యాత్ వర్క్ తదితర పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. కెమికల్ ఇంజ నీరింగ్ రంగంలో ప్రస్తుత పోకడలు, సవాళ్లు, అవకాశాలపై మాట్లాడారు. పరి శోధన, కన్సల్టెన్సీ కోసం ఐఐటీకి సహకరించడానికి వారు తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అధ్యాపకులు, విద్యార్థులు పరిశ్రమ ప్రతినిధులతో సంభాషించడానికి ఒక వేదికను అందించి ప్రొఫెసర్ కెఎస్ఎంఎస్ రాఘవరావు తెలియజేశారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 29: సూళ్లూరుపేట పట్టణంలో సోమవారం విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేసి తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య కథనం మేరకు... పట్టణంలోని బాపూజి కాలనీలో సామర్ల రమేష్ ఇంటిపై విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉన్న 117 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఆ బియ్యం అదే ప్రాంతానికి చెందిన మీజూరు హరినాథ రెడ్డికి చెందినదిగా విచారణలో తేలింది. దీంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్ తదితరులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సప్లయిస్ గోదాముకు తరలించారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

తడ, జనవరి 29: మండల పరిధిలోని పెద్దమాంబట్టు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మల్లికార్జున్‌రావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. సిలబస్ ఎంత వరకు పూర్తి చేశారన్న విషయంపై విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. సీబీఏ పరీక్షకు సంబంధించి ఓఎంఆర్ పత్రాలను విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

అధ్యాపకులకు శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వాతిపుత్రన్

కోట, జనవరి 29: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులకు ఇలాంటి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థులు కావాల్సిన ఉద్యోగ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఎంతో ఉపయోగమన్నారు. మాస్టర్ ట్రైనర్ స్వాతి పుత్రన్ అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

అటవీ కార్మికులకు న్యాయం చేయండి



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ, కార్మిక సంఘాల సభ్యులు

నాయుడుపేట, జనవరి 29: తిరుపతిలోని అటవీ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలంటూ సీఐటీయూ నాయకులు చాపల వెంకటేశ్వర్లు, ముకుంద డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు, వివిధ కార్మిక సంఘాల సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 160మంది అటవీ కార్మికులను పక్కనపెట్టి ఇతరులను విధుల్లోకి తీసుకోవడం సబబుకాదన్నారు. 160మంది కార్మికులు మూడేళ్లుగా రిలే దీక్షచేస్తున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇకనైనా అటవీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల సభ్యులు గోపాలయ్య, చంద్రకళ, మధు, మస్తానయ్య, అరావళి, చంగయ్య, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమకు రెండో సారి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న నవీన్‌కుమార్

శ్రీసిటీ, జనవరి 29: అంతర్జాతీయ కస్టమ్స్ డే-2024 సందర్భంగా, విజయవాడలోని కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం వారు శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమకు ఉత్తమ దిగుమతిదారు అవార్డు అందజేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పనితీరు ఆధారంగా ఈ ఎంపిక జరగగా ఈ నెల 27న కాకినాడలో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్, సెంట్రల్ పన్నుల చీఫ్ కమిషనర్ నుంచి సిద్ధార్థ కంపెనీ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ అవార్డును అందుకున్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఇది వరుసగా రెండవ సంవత్సరం కావడం విశేషం. కాగా ఇది కంపెనీ ఉత్తమ పనితీరు, నిబద్ధతకు నిదర్శనం. తమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమిష్టి కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని సిద్ధార్థ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య అన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టరక్ డా. రవీంద్ర సన్నారెడ్డి సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందాన్ని అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.04 కోట్లు

తిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.04 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది.